J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 20




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 03 25.6.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

ఇక్కడ వైయస్ఆర్‌సిపి

అక్కడ వైయస్ఆర్‌టిపి

## తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తిరేపుతున్న

# కుటుంబ కథా చిత్రం

- జులై 8 నుండి వ్యూహాత్మకంగా వైయస్ఆర్‌టిపి అడుగులు
- రెండు రాష్ట్రాల మధ్య ముదురుతున్న జల వివాదం
- కెసిఆర్‌కు వ్యతిరేకంగా పెరుగుతున్న జన నినాదం
- కొత్త పార్టీతో షర్మిల మ్రోగించనున్న రాజన్న పాలన నాదం



ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో చరిత్రాత్మక ముఖ్యమంత్రిగా వాసికెక్కిన నాయకుడు దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి. ఇప్పుడు ఆయన ముద్దుల కూతురు షర్మిల రాజకీయాలలో చకచకా వేస్తున్న అడుగులు రెండు తెలుగు రాష్ట్రాలలో ఆసక్తిని రేపుతున్నాయి. ఆమె తెలంగాణలో పెట్టబోయే కొత్త పార్టీ పేరు రాజకీయ వర్గాలలో పెను సంచలనంగా మారింది.

2 లో

- షేర్ మార్కెట్‌లో సంచలనం

## పబ్లిక్ ఇష్యూకి వెళ్ళి

# అదరగొట్టిన మన నెల్లూరోళ్ళు

ఆ ఇద్దరూ నెల్లూరోళ్ళే. ఒకరిది పొదలకూరు మండలం మహమ్మదాపురం అయితే, ఇంకొకరిది చేజర్ల మండలంలోని మాముడూరు. రెండు మండలాలూ వేరైనా ఇవి పక్కపక్క గ్రామాలే. ఒకరు దొడ్లడెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ దొడ్ల సునీల్‌రెడ్డి కాగా, రెండవ వారు కిమ్స్ హాస్పిటల్స్ సారథి బొల్లినేని భాస్కరరావు. వీరిద్దరూ ఇప్పుడు భారతీయ స్టాక్ మార్కెట్లో సంచలనంగా నిలిచారు.

6 లో

FOR HEALTHIER LIFE DODLA DAIRY

KIMS HOSPITALS™

40 లాయర్ YEARS



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక



కీ॥శే॥ గునుపాటి ఆదిశేషారెడ్డి గారు
సీనియర్ న్యాయవాది



సమున్నత ఆశయంతో, మహోన్నత లక్ష్యంతో
మా "రాజగోపాల చిన్నాన్న" ప్రారంభించిన
అక్షర యజ్ఞాన్ని 40 సంవత్సరాలుగా
నిరంతరాయంగా కొనసాగిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ...
సమధికోత్సాహంతో స్వర్ణోత్సవం వైపు దూసుకుపోతున్న

లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ అభినందనలు.

గునుపాటి మురళీకృష్ణారెడ్డి
ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్

శ్రీ సాయి కృష్ణా కన్‌స్ట్రక్షన్స్

SSKC

# కుటుంబ కథా చిత్రం

(మొదటి పేజీ తరువాయి)



ఆంధ్రాలో అధికారంలో ఉన్న వైయస్ఆర్‌సిపి అనే పేరుకు అతి దగ్గరగా కేవలం ఒక్క అక్షరం మార్పుతో షర్మిల వైయస్ఆర్‌టిపి పేరుతో పార్టీ పెట్టడం అందరిలోనూ కొత్త ఆలోచనలకు తెర లేపుతోంది. ఆమె రాజకీయ ప్రవేశంపై ప్రకటన చేసిన వెంటనే, అన్నపై మనస్తాపం చెంది తెలంగాణలో రాజకీయ ఆరంగేట్రం చేసిందన్న వార్తలు గుప్పుమన్నాయి. ముందు ఎవరున్నారు...? వెనుక నుండి ఎవరు నడిపిస్తున్నారు...?? లాంటి అనుమానాలు కూడా చాలా మందికి వచ్చాయి. కానీ, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు గమనిస్తే, ముందు వెనుకా అంతా కుటుంబ నేపథ్యమే తప్ప ఇంకెవ్వరూ లేరన్న స్పష్టమైన సంకేతాలు వస్తున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

## జులై 8 నుండి వ్యూహాత్మకంగా షర్మిల అడుగులు

జులై 8వ తేదీ వైయస్ రాజశేఖరరెడ్డి 72వ జయంతి సందర్భంగా షర్మిల తమ పార్టీ జెండా అజెండా ప్రకటించబోతున్నారు. అన్న జగన్ లాగా ఆమె కూడా ఇడుపులపాయ నుండే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తారో... లేక తమ నాన్నకు సెంటి మెంట్టైన చేవెళ్ల నుండి సమరశంఖం పూరిస్తారో చూడాలి. తెలంగాణ సెంటిమెంటును కూడా ఆమె గౌరవించాలి కాబట్టి చేవెళ్లే ఆమెకు అన్నివిధాలా సముచిత వేదిక. ఇక ఆ రోజునుండి తన మెట్టినింట రాజకీయ కార్యకలాపాలను ఆమె ఉధృతం చేయబోతున్నారని వార్తలు వస్తున్నాయి.

## ముదురుతున్న జల వివాదం

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం క్రమేణా పెరుగుతూ ఉంది. అక్రమ ప్రాజెక్టులతో ఆంధ్రా ప్రభుత్వం జల దోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహపూరితమైన వాతావరణం ఉండాలని తమ ముఖ్యమంత్రి కేసిఆర్ కోరుకుంటున్నారని, ఆంధ్రా ప్రభుత్వం మాత్రం తమతో కయ్యానికి కాలు దువ్వుతోందని విమర్శిం చారు. అపెక్స్ కౌన్సిల్లో ఇచ్చిన మాటను తుంగలో తొక్కారని ఆరోపణ చేశారు.

ఆంధ్రా మంత్రి అనిల్‌యాదవ్ కూడా ఈ వివాదంపై తనదైన తరహాలో సమాధానం చెప్పారు. మీరు ధర్నాలు చేసుకుంటే చేసుకోండి, మేము కూడా అపెక్స్ కౌన్సిల్ లోనే పోరాడతాం అంటూ వివరణ ఇచ్చారు. తమకున్న హక్కు ప్రకారమే ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వం దీనిపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఈ విషయాన్ని ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని మాట్లాడుకుంటారని, మధ్యలో వాళ్ళు అనవసరంగా రాద్ధాంతం చేయడం సబబు కాదని హితవు పలికారు.

రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదమన్నది చాలా సున్నితమైన అంశం. ఈ వివాదంపై అటు తెలంగాణ నేతలు, మంత్రులు మాట్లాడినా ఇటు ఆంధ్రా నేతలు, మంత్రులూ మాట్లాడినా తమ అధినేతల ఆదేశం, అనుమతి లేనిదే మాట్లాడరని అందరికీ తెలిసిందే. ఇప్పుడు వీళ్ళు చేస్తున్న కామెంట్లు భవిష్యత్తులో అధినేతల మధ్య అగ్గి రాజేస్తుందన్నది కూడా జగమెరిగిన సత్యమే. ఇప్పుడు ఈ వివాదంలో షర్మిల స్టాండ్ ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## కేసిఆర్‌కు వ్యతిరేకంగా పెరుగుతున్న జన నినాదం

ప్రత్యేక రాష్ట్రం సెంటిమెంటుతో తెరపైకి వచ్చారు తెలంగాణ సియం కేసిఆర్. సోనియాగాంధీ నాయకత్వంలోని అప్పటి కాంగ్రెస్ వృద్ధ జంబూకాలు తీసుకున్న మెంటల్ నిర్ణయంతో రాత్రికి రాత్రి రాష్ట్రం విడిపోవడంతో ముఖ్యమంత్రై కూర్చున్నారాయన. అతి చాకచక్యంగా తన పరిపాలన సాగిస్తూ వరుసగా రెండవ సారి కూడా అధికారం చేజిక్కించుకున్నారు. కుటుంబ పాలన సాగిస్తున్నారని వస్తున్న ప్రచారాన్ని సైతం తెలివిగా తిప్పికొట్టారు. మూడవసారి కూడా అధికారం దక్కించుకోవాలని ఇప్పటినుండే పావులు కదుపుతున్నారు. తనది మిస్టర్‌క్లీన్ ప్రభుత్వం అనిపించుకోవడానికి సంకేతం అన్నట్లుగా తన క్యాబినెట్‌లోని మంత్రి ఈటెలను బలిచేశాడు. ఆయన ఎన్ని టక్కుటమార ట్రిక్కులు చేసినా, ప్రజలతో పాటు సొంత పార్టీలోకూడా చాలామంది కేసిఆర్‌పై గుర్రుమంటున్నారని ఆ పార్టి నేతలే గుసగుస లాడుకుంటున్నారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న పార్టీపై సహజంగానే కొంత వ్యతిరేకత ఉంటుంది. కేసిఆర్‌పై చాలామందికి ఉన్న అసంతృప్తికి ఈ వ్యతిరేకత తోడవుతుంది.

## రాజన్న పాలనే షర్మిల నాదం

షర్మిల పార్టీ ప్రకటన చేసినప్పుడు ఆమెను చాలా మంది తక్కువగా అంచనా వేశారు. జగన్‌లాగే ఆమె కూడా రాజన్న బిడ్డే అన్న సంగతి ఇక్కడ వాళ్ళు మర్చిపోయారు. అన్న జైల్లో ఉంటే ఆయన ఆశయాన్ని బ్రతికించడానికి వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన విషయం విస్మరించారు. తాను జగనన్న వదిలిన బాణాన్ని అంటూ... బై బై బాబు, బై బై పప్పు... అంటూ తండ్రీకొడుకులను తరిమికొట్టిన సంగతిని వాళ్ళు గుర్తు పెట్టుకోలేదు. వ్యూహాత్మకంగా ఆమె తన అడుగులు వేసుకుంటూ వెళ్తోంది. పార్టీ పేరు చెప్పగానే ఆంధ్రాలో విశేష ఆదరణ పొందిన వైయస్ఆర్‌సిపి మదిలో మెదిలేలా వైయస్ఆర్‌టిపి అంటూ ఆమె తన పార్టీకి పేరును పెట్టుకున్నారు. ఇందుకు అనుమతి కోసం వైయస్ఆర్‌సిపి గౌరవ అధ్యక్షురాలు వైయస్ విజయమ్మ చేత కూడా ఎన్నికల సంఘానికి తనకు అభ్యంతరం లేదని లేఖ ఇప్పించారు. ఆంధ్రాలో అమలవుతున్న సంక్షేమ పాలన తెలంగాణలోను సాగిస్తామంటూ “రాజన్న పాలన” నాదాన్ని వినిపిస్తున్నారు. ఆంధ్రాలో కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా చచ్చిపోయినా తెలంగాణలో మాత్రం కొన వూపిరితో కొట్టకలాడుతోంది. చాలా ముందు చూపుతో షర్మిల తమ పార్టీకి ఎక్కడా కాంగ్రెస్ అనే శబ్దం రాకుండా జాగ్రత్త పడ్డారు.

మొత్తానికి వైయస్ కుటుంబ కథాచిత్రం రసవత్తరంగా సాగుతోందన్న చర్చ సర్వత్రా వినపడుతోంది. రాజకీయాలలో శాశ్వత శత్రువులు ఉండరు, మిత్రులూ ఉండరు. ఒక వేళ కొంతమంది ఊహించినట్లుగా ఇది అన్నాచెల్లెళ్ళ మధ్య వివాదమే అయితే పరిష్కరించడానికి విజయమ్మ ఉండనే ఉన్నారు. ఆలాకాకుండా వ్యూహాత్మక రాజకీయ నాటకమే అయితే ఆంధ్రాలో లాగ దీవించడానికి తెలంగాణలోనూ రాజన్న అభిమానులు కోకొల్లలుగా ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ కుటుంబ కథాచిత్రం ఎలాంటి మలుపు తీసుకుంటుందో... ఎలాంటి సంచలనాలను సృష్టించబోతోందో వేచి చూడాలి!.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 YEARS

నెల్లూరు విశేషాల ప్రతిబింబం
సంపూర్ణ సమాచార కదంబం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు



యరబాక మీరారెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్

SKCL
SRI KAUSALYA CONSTRUCTIONS LTD.
CHENNAI

## టిటిడి పాలక మండలి రద్దు...
# తాత్కాలిక ఛైర్మన్‌గా ఇ.ఓ నియామకం

**• ప్రభుత్వం తాజా ఉత్తర్వులు**

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి కాలపరిమితి ఈనెల 21వ తేదితో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పాత పాలకమండలిని రద్దు చేసింది. ఆ మేరకు తాజాగా ఈనెల 23వ తేది బుధవారం జిఓ ఎంఎస్ నెంబరు 146ని ప్రభుత్వం విడుదల చేసింది. తాజా ఆదేశాల ప్రకారం పాలకమండలి స్థానంలో టిటిడి స్పెసిఫైడ్ అథారిటీ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ స్పెసిఫైడ్ అథారిటీకి టిటిడి కార్యనిర్వహణాధికారి ఛైర్మెన్‌గా వ్యవహరిస్తారు. టిటిడి అదనపు కార్యనిర్వహణాధికారి (అడిషనల్ ఇ.ఓ) కన్వీనర్‌గా ఉంటారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని ఆ జిఓలో ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, టిటిడికి కొత్త పాలకమండలి ఏర్పడేవరకు ఈ స్పెసిఫైడ్ అథారిటీ బాధ్యతలు చేపడుతుంది.

వై.వి.సుబ్బారెడ్డిని మరో ఏడాదిపాటు ఛైర్మెన్‌గా కొనసాగించాలనే ఆలోచన ఉన్నప్పటికీ, బోర్డు సభ్యులను మార్చే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉండడంతో ప్రక్రియ మరో పది రోజులు వాయిదా పడిందని కొంత మంది చెప్తున్నారు. వై.వి.సుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిగా పదోన్నతి కల్పిస్తారని కూడా ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల భోగట్టా! ఈ క్రమంలో స్వామివారి సేవలో తరించబోయే దెవరో తెలుసుకోవడానికి మరికొద్దిరోజులు వేచి చూడాల్సిందే!

**ఓం నమో వేంకటేశాయ!**

## నెల్లూరు ముద్దుబిడ్డ
# మన వెంకయ్య 72వ పుట్టినరోజు

**జూన్ 23న కుటుంబసభ్యుల మధ్య జరుపుకున్న ఉషాపతి**



మన నెల్లూరు బిడ్డ, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి వుండే సౌమ్యశీలి భారత ఉపరాష్ట్రపతి, ఉషాపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు పుట్టినరోజు వేడుక ఢిల్లీలోని తమ నివాసం ఉపరాష్ట్రపతి భవన్‌లో జూన్ 23న నిరాడంబరంగా జరిగింది. ఆయన శ్రీమతి ఉషమ్మతో పాటు కుమార్తె దీపమ్మ, మనుమరాలు సుష్మ ఈ సంబరంలో పాల్గొన్నారు. వెంకయ్య శిష్యుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వెంకయ్య వ్యక్తిగత సిబ్బంది ఉపరాష్ట్రపతికి తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉషమ్మ – వెంకయ్య దంపతులు దేవదేవుని ఎదురుగా పూలదండలు మార్చుకున్నారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా, కరోనా నిబంధలను పాటిస్తూ తన పుట్టినరోజు వేడుకను జరుపుకున్నారు మన ఉపరాష్ట్రపతి. దటీజ్ వెంకయ్యానాయుడు!..



**• తస్మాత్ జాగ్రత్త**

## తగ్గినట్లే తగ్గి...
# పెరుగుతున్న కరోనా


జిల్లాలో తగ్గిపోతుందనుకుంటున్న కరోనా ఇంకా ఉధృతంగానే ఉంటూ తన ప్రతాపం చూపుతూనే ఉంది. ఈనెల 23న 6470 మందికి పరీక్షలు చేయగా 306 మందికి కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ మాయదారి వ్యాధికి మరో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో జిల్లాలో మొత్తం మృతుల సంఖ్య 896 మందికి చేరుకుంది. మొత్తంగా జిల్లాలో ఇప్పటిదాకా కరోనాకు గురైన వారి సంఖ్య 1,25,902 కాగా వీరిలో 1,21,318 మంది కోలుకున్నారు. ఏదేమైనా కరోనాతో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి మరి!

# మెట్ట గ్రామాలకు.. ఇక సోమశిల నీళ్లు

- **13 ఎత్తిపోతల పథకాలకు సిఎం ద్వారా ప్రత్యేక అనుమతి**
- **మంత్రి మేకపాటి చొరవ**



జిల్లాలో తాగునీటికి కటకటపడుతున్న గ్రామాలకు సోమశిల జలాశయం నుంచి నీటిని అందించేందుకు, సాగునీళ్ళందని పొలాలకు నీటి కొరత లేకుండా చేసేందుకు రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల ద్వారా 13 ఎత్తిపోతల పథకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ప్రత్యేక అనుమతి తీసుకుని మంత్రి మేకపాటి మెట్ట ప్రాంత ప్రజల కష్టాలు తీర్చేందుకు కృషిచేస్తున్నారు. ఇటీవల విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, జిల్లా అటవీశాఖ అధికారి నాగేంద్ర, జలవనరుల శాఖ ఎస్ఇ కృష్ణారావు, తెలుగుగంగ అధికారులు, ఆత్మకూరు ఆర్డీఓ చైత్రవర్షిణిలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నీటివనరుల పరిస్థితిని సమీక్షించారు.

## 'ప్రభా'తం

'వృక్షో రక్షతి రక్షిత:'..అన్నారు మన పెద్దలు. ఆ మాటను అక్షరాలా ఆచరణలో పెట్టేందుకు సిద్ధమైన హర్యానా ప్రభుత్వాన్ని తలచుకుని దేశవ్యాప్తంగా ఉన్న వనప్రేమికుల మనసు పులకించిపోతోంది. వృక్షాల సంక్షేమం పట్ల హర్యానా చూపుతున్న ప్రేమాభిమానాలకు, వాటి పరిరక్షణకు వాళ్ళు చేస్తున్న సేవలకు అందరూ జేజేలు పలుకుతున్నారు. మనుషుల మాదిరిగానే వాటినీ ప్రాణమున్నవాటిగా భావిస్తూ 75 ఏళ్ళు దాటిన వృక్షాల పరిరక్షణకు 'ప్రాణవాయువు దేవత పింఛను పథకం' పేరుతో 2500 రూపాయల వంతున పింఛను ఇవ్వాలని, జీవితకాలమంతా మానవాళికి సేవచేస్తున్న వృక్షాలను గౌరవిస్తూ వాటికి గౌరవభృతిని కల్పించాలని, వాటికి కూడా వారసత్వ హోదా కల్పిస్తూ పింఛను మొత్తాన్ని ప్రతిఏటా పెంచాలని..ఇలా పలు సరికొత్త పథకాలకు శ్రీకారం చుడుతున్నారన్న సమాచారం వృక్షాల పట్ల కారుణ్యం ఉన్నవారికంతా ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. వృక్షాలకు పింఛను ఏమిటని ఆశ్చర్యపోకండి.. 75 ఏళ్ళు పైబడిన వృక్షాలు ప్రైవేటు వ్యక్తుల స్థలంలో ఉంటే ఆ యజమానికి ఏడాదికోసారి 'వృక్ష పింఛను' అందిస్తారట. ఇతరత్రా స్థలాల్లో ఉండేవాటికి వాటి యజమానులకు కూడా ఈ పింఛను అందుతుంది. ఆ వృక్షాలకు ఏ చీడపీడలు రాకుండా ఉండేందుకు, వాటిని మరింత శ్రద్ధగా పరిరక్షించేందుకు ఈ డబ్బును వాళ్ళు వినియోగించాల్సి ఉంటుంది. ఈ పింఛన్లు అందుకున్నవారు ఆయా వృక్షాల విశిష్టతను వివరిస్తూ శిలాఫలకం ఏర్పాటుతో పాటు, ఆ వృక్షాలకి రక్షణగా కంచె కట్టించి, అక్కడ ప్రజలు ఆ చల్లటి నీడలో కూర్చునేందుకు తగు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. చూడండి.. ఎంత మంచి ఆలోచనో!.. కేవలం వృక్షాలను పరిరక్షించడానికే కాక వనాలను పెంచడానికి కూడా పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారక్కడ. హర్యానాలో మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు దేశవ్యాప్తంగా సంతోష సంచనాలు కలిగిస్తున్నాయి. ప్రభుత్వాలు ఇంతగా వృక్షాల పరిరక్షణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవడం బహుశా దేశంలో ఇదే మొదటిసారి అనుకోవచ్చు. ఇలాంటి పథకాలు ఎంతైనా మంచివే..అందరూ ఆహ్వానించదగ్గవే. వృక్షాలను కాపాడుకోవడమంటే ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడమే. మానవాళికి ఆహ్లాదకరమైన గాలిని, బతికేందుకు ప్రాణవాయువునిచ్చే మహాదాతలు మన వృక్షాలే. ఓ రెండు నిమిషాలు ఆక్సిజన్ లేకపోతే నిలవలేని మనం..నిలవడానికింత నీడ, ఊపిరి పీల్చుకుని హాయిగా బతకడానికింత గాలిని, ఇంకా తినడానికెన్నో రకాల పండ్లను, ఆరోగ్యాన్నిచ్చే వనమూలికలను, ఆకులు, బెరడులు, చివరికి వేళ్ళు.. ఒకటేమిటి తన దేహంలోని అణువణువును మనిషి జీవనాధారం కోసం ధారపోసే మన వృక్షాలు.. నిజంగా దేవతా వృక్షాలే. అందుకే అవి ప్రత్యక్ష దైవాలు. ప్రకృతిమాత వరప్రసాదాలు. అయితే దేశంలోని అనేక ప్రాంతాల్లో అడవులను అడ్డదిడ్డంగా నరికేయడం, వనాలను నిర్మూలించడం, చెట్లను ఇష్టమొచ్చినట్లు తొలగించేయడం చూస్తూనే ఉన్నాం. ఇక్కడే కాదు ప్రపంచవ్యాప్తంగా ఈ ఘోరకలి ఇట్లాగే సాగిపోతూనే ఉంది. నాగరికత పేరుతో, తన స్వార్థం కోసం, తన విలాసాల కోసం మానవుడు తనని బతికించే చెట్లనే నిర్దాక్షిణ్యంగా నిర్మూలిం చేస్తూ.. చివరికి తన వినాశనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నాడు. పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడే పచ్చని వనాలపై ఇంత నిర్దయ దారుణం. తాను బతికినంతకాలం పదిమందికీ నీడనిస్తూ, మొదలుకంటా నరికేసినా మళ్ళీ కొత్తచివుళ్ళెత్తి పచ్చదనాన్ని వెల్లివిరుస్తుంది..చెట్టు. తనను చీల్చిచెండాడి కట్టెలుగా మార్చి మండించుకున్నా.. వంటలు వండించుకు తిన్నా.. చెట్టు ఎవరినీ పల్లెత్తు మాట అనదు. కన్నబిడ్డలు ఎంత కఠోరహృదయులైనా తల్లి వారిపట్ల కరుణతోనే ఉంటుంది కదా!.. అందుకే వనాలను వనదేవతలుగా, వృక్షాలను దేవతా వృక్షాలుగా పేర్కొన్నారు మన మహర్షులు. చెట్లు పర్యావరణానికి మెట్లు అని తెలిసినా, ఆ పచ్చదనమే లేకుంటే ప్రపంచమే ఎడారవుతుందని తెలిసినా, ఆకు పచ్చని ప్రకృతిని సర్వనాశనం చేసుకుంటున్న వికృత ప్రకృతి మనది. అయినా పూలు, పండ్లతో, ఎన్నో రకాల పక్షిజాతులకు, వన్యప్రాణులకు ఆవాసంగా కళకళలాడుతూ ఉండే చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేసుకోవడం ఎంత దారుణం. ఏళ్ళుతరబడిగా ఉన్న వందల సంవత్సరాల నాటి మహామహా వృక్షాలను సైతం నిలువునా నరికిపారేయడం ఏమిటి?.. మండేఎండలో తామున్నా చల్లటి నీడనిచ్చే వృక్షాలకు ఇదా మనం చూపే కృతజ్ఞత? ఇలాంటి ఆవేదనతో విలవిలలాడిపోయే సున్నిత హృదయాలకు హర్యానా ప్రభుత్వం వృక్షాల పట్ల తీసుకుంటున్న శ్రద్ధకు ఎంతో ఉపశమనం కలుగుతోందంటే అతిశయోక్తి కాదు. వృక్షాలను ప్రాణదేవతలుగా చూస్తున్న హర్యానా లాగా, మిగిలిన రాష్ట్రాల్లోనూ అలాంటి మంచి పథకాలు రావాలి. ఒకవేళ పింఛనుగా కాకపోయినా ఠంచనుగా ఆయా ప్రాంతాల్లో పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ఒక వ్యవస్థను, దానికి వీలైనంత నిధుల్ని కేటాయించాలి. మానవాళికంతటికీ ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అమలుకావాలి. అనవసరంగా చెట్లను నరికేయకుండా వెంటనే గట్టి చర్యలు తీసుకోవాలి. రోడ్ల విస్తరణకు, ప్రజల ప్రయోజనాలకు వృక్షాలు అడ్డంగా ఉన్నాయనుకుంటే, వాటి చుట్టూ చప్టా కట్టి, రోడ్డునే దారిమళ్ళించాలి. మరీ తప్పనిసరైతే తప్ప ఎవరూ చెట్ల జోలికి పోకుండా చూడాలి. ఏదేమైనా. వృక్షాలను దేవతలుగా చూస్తూ వాటి పరిరక్షణకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వాలు, ప్రజలు అంతా కలసికట్టుగా కృషిచేయడం ఎంతైనా అవసరం.

### హర్యానాను చూసి నేర్చుకోవాలి



75 ఏళ్ళు దాటిన వృక్షాల పరిరక్షణకు 'ప్రాణ వాయువు దేవత పింఛను పథకం' పేరుతో 2500 రూపాయల వంతున పింఛను ఇవ్వాలని, జీవితకాలమంతా మానవాళికి సేవ చేస్తున్న వృక్షాలను గౌరవిస్తూ వాటికి గౌరవ భృతిని కల్పించాలని, వాటికి కూడా వారసత్వ హోదా కల్పిస్తూ పింఛను మొత్తాన్ని ప్రతిఏటా పెంచాలని నిర్ణయిస్తూ సరికొత్త పథకాలకు హర్యానా ప్రభుత్వం శ్రీకారం చుడుతోందన్న సమాచారం దేశ వ్యాప్తంగా ప్రకృతి ప్రేమికులకు సంతోషం కలిగిస్తోంది. మానవాళికి ప్రాణ వాయువునిచ్చి బతికించే వృక్షాల పట్ల నిర్దయ పనికిరాదు. వృక్షాలను అందరూ కాపాడుకోవాలి. అందుకు అన్ని రాష్ట్రాల్లోనూ ఇలాంటి మంచి పథకాలు రావాలి. దేశమంతా కూడా ఆ కార్యక్రమాలు అమలుకావాలి.

## అభాగ్యులకు ఆర్యవైశ్యుల ఆపన్నహస్తం

- బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ



ఈ కరోనా కష్టకాలంలో జీవనం గడవక ఇబ్బందులు పడుతున్న అనేకమంది నిరుపేదలకు స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు గత కొద్దిరోజులుగా ప్రతిరోజూ తమవంతు సాయం అందజేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఈ వితరణను ప్రారంభించి పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీచేశారు. గత కొద్దిరోజులుగా ఆర్యవైశ్య ప్రముఖులు ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నెల్లూరులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయం తరఫున, దాతల సహకారంతో ప్రతిరోజూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు. పేదలకు బియ్యంతో పాటు, పద్నాలుగు రకాల నిత్యావసర వస్తువులు, మాస్కులు, కొంతమందికి అమ్మవారి జాకెట్లు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. వాసవీ మాత అమ్మవారి దయతో అందరూ ఆరోగ్యంగా హాయిగా ఉండాలని వారు ఆకాంక్షిస్తున్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని చలువాది శరణ్‌కుమార్, పబ్బిశెట్టి శ్రీనివాసులు నిర్వహిస్తున్నారు. నున్నా రమేష్, పి.సత్యం, వొమ్మిన ఈశ్వర మురళీకృష్ణ తదితరులు పాల్గొని పేదలకు సరుకులు అందజేస్తున్నారు.

## వెంకన్నపాళెం హెడ్మాస్టర్‌కు.. 'ఆయుష్' అభినందన

అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయస్థాయిలో యోగ ప్రాధాన్యతపై ఇటీవల కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ, మైగవ్ పోర్టల్ చేపట్టిన ఆన్‌లైన్ క్విజ్‌పోటీల్లో పాల్గొని విజయవంతంగా క్విజ్‌ను పూర్తిచేసిన కొడవలూరు మండలంలోని వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ తాటిపర్తి వెంకటేశ్వర్లుకు కేంద్ర ఆయుష్‌శాఖ నుంచి అభినందనలు లభించాయి. ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి పిఎన్ రంజిత్‌కుమార్ ఆయన్ను ఎంతగానో అభినందించి ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ పంపడం విశేషం.

## లాయర్‌కి నలభై ఏళ్లా...?

అబ్బా!.. లాయర్ పత్రికకి అప్పుడే నలభై సంవత్సరాలా...? మేము విఆర్ కాలేజీలో ఇంటర్ మీడియట్ చదువుకునే రోజుల్లో అప్పుడే పుట్టింది ఈ పత్రిక. నెల్లూరు జిల్లా స్థానిక పత్రికలకు ప్రసిద్ధి. అప్పటికే జిల్లాలో ఒక పాత పత్రికతో పాటు పదుల సంఖ్యలో చిన్న పత్రికలు నడుస్తుండేవి. వాటి మధ్యలో పుట్టిన లాయర్‌ని కూడా అప్పట్లో మేం పెద్దగా అంచనా వేయలేకపోయాం. కస్తూరిదేవి విద్యాసంస్థల ఆస్తుల పరిరక్షణ, ఆడ పిల కాయలు చదువుకునే డికెడబ్ల్యు కాలేజీ, కస్తూరిదేవి స్కూళ్ళ మధ్యలో నిర్మితమవుతుండిన సినిమాహాళ్ళను అడ్డుకోవడం ఈ పత్రిక ప్రధాన అజెండా అని చెప్పుకునే వాళ్ళు. అక్కడికే పరిమితమై లాయర్ అప్పుడే ఆగిపోద్దనుకున్నాం. మా అంచనాలను తారుమారు చేస్తూ ఆ తరువాత రోజుల్లో జిల్లాలోనే ఒక ప్రతిష్టాత్మక పత్రికగా లాయర్ ఎదిగింది. ఆ రోజుల్లో సీరియల్ లాగా వచ్చిన కోట – వాకాడు యుద్ధం పెద్ద సంచలనం. తరువాతి కాలంలో కూడా బైరాగిమఠం ఆస్తుల విషయంలోనూ, అప్పట్లో పలు దేవాలయాలలో జరుగుతుండిన అవక తవకలను బయట పెట్టడంలోనూ లాయర్ నిర్మాణాత్మక పాత్ర పోషించింది.

వ్యవస్థాపకులు రాజగోపాలరెడ్డి గారు మాకు బాగా గుర్తు. ఖద్దరు పంచ చొక్కా. ధరించి ఎప్పుడూ నవ్వుతూ కనిపించేవారు. ఆయన పరమపదించిన తరువాత కూడా లాయర్‌కి ఎక్కడా వన్నె తగ్గకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా పత్రిక గెటప్‌లో సైతం ఎప్పడికప్పుడు మార్పులు తీసుకువస్తూ ఆయన వారసుడు పత్రికను ప్రపంచవ్యాప్తం చేయడం గొప్ప విషయం. నా కళ్ళముందు పుట్టిన లాయర్‌కి నలభై ఏళ్ళు వచ్చాయనగానే ఒక్కసారిగా నా వయసు కూడా పెరిగిపోతోంది కదా అని పించింది. మా తరంలో పుట్టిన ఈ పత్రిక, ఈ తరంతో పాటు భవిష్యత్ తరాలకు కూడా దిక్సూచిగా ఎదగాలని కోరుకుంటూ, నిర్వాహకులకు నా అభినందనలు.

**ఎం.రంగనాథ్, డల్లాస్, టెక్సాస్.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## ప్రత్యేక సంచికలలో మేటి లాయర్!

లాయరు పేపరు పెట్టినప్పటి నుండీ చదువుతున్నాను. విశ్లేషణాత్మకమైన వ్యాసాలతో, వివరణాత్మకమైన కథనాలతో ప్రతీ వారం పాఠకులను ఆకట్టుకుంటోంది. నాకు తెలిసినంత వరకు లాయర్ పేపర్ ప్రచురించినన్ని ప్రయోగాత్మక ప్రత్యేక సంచికలు బహుశా తెలుగు రాష్ట్రాలలోనే కాదు దేశంలోని ఇతర భాషలలో కూడా ఇప్పటివరకు ఏ స్థానిక పత్రికా ప్రచురించి ఉండక పోవచ్చు. దాదాపుగా లాయర్ ప్రచురించిన స్పెషల్ ఇష్యూలన్నీ నా దగ్గర వున్నాయి. జిల్లా పారిశ్రామికాభి వృద్ధిపై తొలినాళ్ళలో వేసిన ప్రత్యేకసంచిక మొదలు, చేనేత పరిశ్రమలు, చేతి వృత్తుల వారి కష్టాలను ఆవిష్కరిస్తూ ముద్రించిన వార్షికోత్సవ స్పెషల్ ఇప్పటికీ నేను భద్ర పరుచుకుని ఉన్నాను. ఆ తరువాత రోజుల్లో వెలువడిన, చిత్ర సింహపురీయం, శీనయ్య జ్ఞాపిక, బెజవాడ గోపాలరెడ్డి గారి జన్మదిన విపంచిక "బ్రతుకంతా బృందా వనమే", 'లాయర్ ఈ మాసం' అంటూ రెండు సంవత్సరాల పాటు వివిధ రంగాలపై ముద్రించిన మాస సంచికలతో పాటు ఇటీవల వేసిన 'ఇదీ సాంబమూర్తి గారి కథ', 'చిన్నారుల విజయదీపిక', 'పెళ్ళి పుస్తకం'తో పాటు వివిధ రంగాలలో ప్రసిద్ధిగాంచిన నెల్లూరు మహిళామణుల విజయగాథలను తెలియజేసే "సింహ పురికి వన్నె తెచ్చిన వనితలు" ఇవన్నీ దేనికదే సాటి. ఖచ్చితంగా, క్రమంతప్పకుండా వారం వారం వచ్చే లాయర్ వారపత్రికలతో పాటు, ప్రత్యేక సంచికలలో సైతం మేటి మన లాయర్. పత్రికా రంగంలో నలభై సంవత్సరాలుగా నిర్విరామ కృషి చేస్తున్న లాయర్ బృందానికి నా అభినందనపూర్వక శుభాకాంక్షలు.

**కొలకనూరు చక్రవర్తి, హైదరాబాద్.**

Zapcom GROUP, INC

•USA•INDIA•COSTA RICA•

40 లాయర్ YEARS



Late. Tunga RajaGopalaReddy Garu

Founder, Lawyer Weekly

*Congratulations to the entire LAWYER team*
*on the occassion of 40th Anniversary.*
*They made LAWYER a legendary platform*
*for 'Connecting Nellorian's all over the globe and*
*"raising the bar" in journalism!*



**P. PARAMDHAMAREDDY**

Director & Chairman,

**ARRKP Hospitality pvt ltd.**

**Platinum Residences**

Aditya Nagar, Nellore.

red rhino CRAFT BREWERY• INSPIRED KITCHEN



## KISHORE PALLAMREDDY

CEO

**Zapcom group Inc.**

Managing Director

**ARRKP Hospitality pvt ltd.,**

**ARRKP Beverages pvt ltd.**

**Uptown Square, Whitefield, Bangalore - 560067.**

# పబ్లిక్ ఇష్యూకి వెళ్ళి.. అదరగొట్టిన మన నెల్లూరోళ్ళు

(మొదటి పేజీ తరువాయి)



యుగాండాలోని దొడ్ల డెయిరీ ప్లాంట్



సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణం

ఒకరిది ఆరోగ్యవంతమైన పాల వ్యాపారం, రెండవ వారిది అదే ఆరోగ్యాన్ని సంరక్షించే వైద్య వృత్తి.

జూన్ 16, 17, 18 తేదీలలో భారతీయ షేర్ మార్కెట్లో వీళ్ళిద్దరి పేర్లు మారు మోగిపోయాయి. ఈ రెండు కంపెనీలూ పబ్లిక్ పెట్టుబడులు ఆకర్షించడానికి జూన్ 16వతేది ఐపిఓ (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్)కి వెళ్ళాయి. రెండూ తెలుగువారి కంపెనీలు, ఇద్దరూ నెల్లూరుజిల్లా వాళ్ళు, అదీ పక్క పక్క గ్రామాల వాళ్ళు కావడం, రెండు కంపెనీలూ ఒకేరోజు పబ్లిక్ ఇష్యూకి వెళ్లడం ఇక్కడ విశేషం. సునీల్‌రెడ్డి స్వగ్రామం మహమ్మదాపురం. భాస్కరరావుది మాముడూరు.

## దొడ్ల డెయిరీ

1995లో నెల్లూరు జిల్లా దేవరపాలెం గ్రామంలో దొడ్ల డెయిరీకి బీజం పడింది. సంస్థ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి సారధ్యంలో ఆయన కుమారుడు సునీల్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏర్పడిన సంస్థ 1997 నుండి తమ ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయించడం మొదలు పెట్టింది. అక్కడి నుండి అంచెలంచెలుగా విస్తరించి ఇప్పుడు భారతదేశంలోని 5 రాష్ట్రాలలో 13 ప్లాంటులను నెలకొల్పి 94 చిల్లింగ్ సెంటర్ల ద్వారా వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. దేశంలోని 11 రాష్ట్రాలలో తమ ఉత్పత్తులను విక్రయిస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్లో తమ ఉనికిని చాటుకుంటూ ఉగాండాలో కూడా ఒక ప్లాంటు పెట్టి ఉగాండా మరియు కెన్యా వాసులకు సైతం దొడ్ల ఉత్పత్తులను అలవాటు చేసి తమ సత్తా చాటుకుంది దొడ్ల డెయిరీ.

తొలుతగా పాల సేకరణ ద్వారా తమ వ్యాపారాన్ని మొదలు పెట్టిన సంస్థ క్రమేణా పాల ఆధారిత ఇతర ఉత్పత్తులను కూడా తయారుచెయ్యడం ప్రారంభించింది. ఆ క్రమంలోనే పాలతో పాటు పాలపొడి, మజ్జిగ, వెన్న, నెయ్యి , పెరుగు, పన్నీర్, ఫ్లేవర్డ్ మిల్క్, దూద్‌పేడా, ఐస్‌క్రీమ్‌లే కాకుండా పాలు ఆధారిత స్వీట్లు కూడా తయారుచేయడం ప్రారంభించింది. శుచి, శుభ్రతతో పాటు, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వినియోగదారుల నమ్మకాన్ని, ఆదరణని తమ సొంతం చేసుకుంది దొడ్ల డెయిరీ.

హైదరాబాదులో తమ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని తనను తాను రుజువు చేసుకుని ఇప్పుడు పెట్టుబడులకు సెబీ వేదికగా బహిరంగ మార్కెట్లోకి వచ్చింది. వచ్చీ రాగానే పెట్టుబడిదారుల నుండి విపరీతమైన స్పందనను తమ సొంతం చేసుకుని సంచలనంగా నిలిచింది. జూన్ 16వతేదీ స్టాక్స్ ఓపెన్ చేసి జూన్ 18 వరకు గడువు పెట్టుకుంటే, మొదటి రెండు రోజుల్లోనే అనూహ్య స్పందన రావడంతో పాటు చివరి రోజైన జూన్ 18వ తేదీ గడువు ముగిసే నాటికి 46.3 శాతం అధికంగా సబ్‌స్క్రైబ్ కావడంతో దొడ్ల డెయిరీ అతి పెద్ద కార్పొరేట్ సంస్థల సరసన తానూ ఒకటిగా నిలిచినట్లయ్యింది. మన నెల్లూరీయుల సంస్థ షేర్ బజార్‌లో ఇంతటి స్థాయిలో ఆదరణ పొందిందంటే అది ప్రతి నెల్లూరీయుడికీ గర్వకారణమే. ఈ విజయంలో భాగస్వామ్యులైన ఆ సంస్థ యాజమాన్యాన్ని కార్యనిర్వాహక బృందాన్ని అభినందించాల్సిందే.


## కిమ్స్...

ప్రముఖ వ్యాపారవేత్త బొల్లినేని కృష్ణయ్య సోదరుడు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు సారధ్యంలో 2000వ సంవత్సరంలో నెలూరులో బొల్లినేని హాస్పిటల్స్ పేరుతో కిమ్స్ ఆవిర్భవించింది. ఆ తరువాత 2002లో తమ రెండవ శాఖను "కిమ్స్" కృష్ణయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో రాజమండ్రిలో ప్రారంభించారు. 2004లో సికింద్రాబాదులోని మినిస్టర్స్ రోడ్డులో తమ 3వ అతిపెద్ద శాఖను కిమ్స్ నిర్వాహకులు ప్రారంభించారు. ఇప్పుడు సికింద్రాబాద్ శాఖ వెయ్యి పడకలు కలిగిన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ వైద్యాలయంగా పేరు గడించింది.

రెండు తెలుగు రాష్ట్రాలలో 9 బ్రాంచీలు కలిగి అతిపెద్ద వైద్య వ్యవస్థగా కిమ్స్ ఎదిగింది.

ఇప్పుడు పెట్టుబడుల కోసం కిమ్స్ కూడా బహిరంగ మార్కెట్లోకి వచ్చింది. కిమ్స్ కూడా జూన్ 16నే ఐపిఓ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్)తో షేర్ మార్కెట్లోకి అడుగు పెట్టింది. 18వతేదీ గడువు ముగిసే నాటికి 3శాతం అధికంగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. వైద్య ఆరోగ్య రంగంలో తమ సేవలను విస్తరించుకోవడానికి కిమ్స్ చేసిన ప్రయత్నాన్ని కూడా పెట్టుబడిదారులు ప్రోత్సహించారు.

మొత్తానికి మహమ్మదాపురానికి చెందిన దొడ్ల కుటుంబం, పక్కవూరు మాముడూరుకి చెందిన బొల్లినేని కుటుంబం భారతీయ షేర్ మార్కెట్లోకి వచ్చి బహిరంగ పెట్టుబడులను ఆహ్వానించడం హర్షణీయం. రెండు కుటుంబాల వారికి 'లాయర్' అభినందనలు.

# బ్లాక్ ఫంగస్ బాధితునికి 'దీపమ్మ' వెలుగు

- ప్రాణాలు నిలబెట్టిన స్వర్ణభారత్ ట్రస్టీ
- వైద్యులు, జిల్లా కలెక్టర్ సహకారం
- ఆరోగ్యంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి



*అసలే ప్రాణాంతకమైన కరోనా మహమ్మారి సోకింది. దీంతో ఎలాగో బయపడినా 'బ్లాక్ ఫంగస్' వ్యాధి తగులుకుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇక తాను బతకనేమో.. తన జీవితం ఏమైపోతుందోనంటూ భయాందోళనలకు గురవుతున్న ఒక బాధితునికి వెంటనే తగు వైద్యవసతులు అందేలా చేసి ఆ వ్యక్తి కోలుకునేందుకు స్వర్ణభారత్ ట్రస్టీ దీపమ్మ మానవతా హృదయంతో శ్రద్ధ తీసుకుని తిరిగి ఆ బాధితుడు కోలుకునేందుకు సాయం అందించి అందరి ప్రశంసలు అందుకున్నారు. మానవతా హృదయంతో దీపమ్మ చూపిన చొరవ ఓ వ్యక్తి ప్రాణాలను నిలబెట్టింది. వివరాలిలా ఉన్నాయి.*

పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు గ్రామానికి చెందిన కొల్లపల్లి అంజిబాబు గత మే నెలలో కోవిడ్ బారిన పడ్డారు. అయితే ఆయన కోవిడ్ సమస్యను అధిగమించినా బ్లాక్ ఫంగస్ రూపంలో ప్రమాదం ఎదురైంది. వెంటనే ఆసుపత్రులకు వెళ్ళినప్పటికీ తగు వైద్యం అందకపోవడంతో తనిక బతకడమేమో అనుకుని ఆయనతో పాటు కుటుంబసభ్యులు కూడా అల్లాడిపోయారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఆయన ఆరోగ్యపరిస్థితి గురించి ఆరా తీసి వెంటనే విజయవాడలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందేలా వైద్యులతో సంప్రదించి తగు ఏర్పాట్లు చేశారు. ముందు రోగిని ఆసుపత్రిలో చేర్చుకుని పర్యవేక్షించాలని కోరారు. దీపమ్మ చొరవతో అంజిబాబును ఆసుపత్రిలో చేర్చుకుని వైద్యులు చికిత్స అందించడం ప్రారంభించారు. ఒక దశలో అయన పరిస్థితి విషమించి వెంటిలేటర్‌పై ఉంచాల్సి వచ్చింది. ఆ సమయంలో లక్షలాది రూపాయలు ఖర్చుయినప్పటికీ ఆ మెత్తాన్ని మానవతా దృక్పధంతో ఆసుపత్రి యాజమాన్యం భరించింది. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా కూడా చికిత్సకు అవసరమైన కొన్ని మందులు, ఇంజెక్షన్లను ఇచ్చే ఏర్పాటుచేసి తనవంతు సహకారం అందించారు. దీపా వెంకట్ ఎప్పటికప్పుడు బాధితుని ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తూ వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్తూ వచ్చారు. ఎట్టకేలకు ఆ బాధితుడు క్రమేణా ఆరోగ్యంతో కోలుకుని ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావడంతో ఆయన కుటుంబసభ్యుల ఆనందానికి అవధుల్లేవు. వారెంతో సంతోషంగా స్వర్ణభారత్ ట్రస్ట్‌కు, దీపా వెంకట్‌కు, కామినేని ఆసుపత్రి యాజమాన్యానికి, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాకు తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అనారోగ్యం పాలై జీవితం మీద ఆశ వదలుకున్న తరుణంలో తమ కుటుంబసభ్యుని ప్రాణాలు నిలబెట్టేందుకు దీపమ్మ చేసిన సాయం మరచిపోలేమని వారు మనసారా ఆమెకు తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## సిఐడి డిఎస్పీగా వేణుగోపాల్

నెల్లూరు సిఐడి(జనరల్ అఫెన్స్ వింగ్) డిఎస్పీగా వేణుగోపాల్‌ను నియమిస్తూ సిఐడి శాఖ అడిషనల్ డీజీ సునీల్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. 1991 బ్యాచ్‌కు చెందిన వేణుగోపాల్ ప్రస్తుతం ఒంగోలులో ట్రాఫిక్ డిఎస్పీగా ఉన్నారు.


## ఆనందయ్యను కలసిన మాగుంట రాఘవరెడ్డి



కరోనా నివారణకు ఆయుర్వేద మందును ఇస్తున్న ఆనందయ్యను ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఇటీవల నెల్లూరులో కలిశారు. ప్రకాశం జిల్లా ప్రజలకు ఇవ్వడం కోసం అడిగిన వెంటనే ఆయుర్వేద మందును అందజేసిన ఆనందయ్యకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పన్నులు ఘోరం.. ప్రజలకు భారం

ఆస్తి విలువ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా యూజర్ ఛార్జీల పేరుతో పన్నులు వేయడం ఘోరమని, ప్రజలకు పెనుభారంగా పరిణమించే ఈ పన్నులను వెంటనే ఉపసంహరించుకోవాలని సింహపురి టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి కోరారు. ఈనెల 20న నెల్లూరులోని జరిగిన రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త పన్నుల విధానం వల్ల ప్రజలకెంతో నష్టం కలుగుతుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలే ఈ పన్నులను వ్యతిరేకిస్తుంటే ఏపిలో ఈ పన్నులు ఎందుకు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అసలే కరోనా నేపథ్యంలో ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందులు పడుతుంటే మళ్ళీ పన్నుల భారం మోపడం దారుణమంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం వీటిని వెనక్కుతీసుకోకుంటే లక్ష నిరసన పత్రాలను ముఖ్యమంత్రికి పంపుతామన్నారు. పలు సంఘాల నాయకులు బూదాటి రాధయ్య, మాదాల వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, బ్రహ్మం, విశ్వమోహన్, శ్రీరాములు, రామరాజు, నాగేంద్ర, ప్రత్యూష్, సాయకుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### కరోనా నివారణార్థం.. లోక సంరక్షణార్థం..

# వైభవంగా శ్రీ లలితా మహాయాగం

## దేశవ్యాప్తంగా 40 మంది ప్రముఖ రుత్విక్కుల రాక



కరోనా మహమ్మారి వ్యాధి నుంచి మానవాళిని కాపాడాలని కోరుకుంటూ నెల్లూరులో శక్తివంతమైన శ్రీ లలితా మహాయాగం జరిగింది. లోకసంరక్షణార్ధం పెద్దఎత్తున జరిగిన ఈ మహాయాగంలో దేశవ్యాప్తంగా 40 మందికి పైగా ప్రముఖ రుత్విక్కులు ఎంతో విశేషం. నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఈనెల 20న కుర్తాళం పీఠం ఆస్థానపండితుడు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ యాగం ప్రారంభమైంది. అయిదురోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో రుత్విక్కులంతా కలసి ఈ మహాయాగం చేశారు. తొలుత 'మహాసంకల్పం' చేసి, గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం యాగానికి అంకురార్పణ జరిగింది. పెద్దఎత్తున గణపతి హోమం, లలితా సహస్రనామ హోమం జరిగాయి. ఈ అయిదురోజులూ రుత్విక్కుల వేదమంత్రాలతో యాగం నిర్వహణ ప్రాంతం మార్మోగింది.

# చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

## - నేతన్నల నేత.. కెవి శేషయ్య విజ్ఞప్తి



కరోనా నేపథ్యంలో పనులు లేక జీవనం గడవక ఇబ్బందులు పడుతున్న పేద చేనేత కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వీవర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి శేషయ్య విజ్ఞప్తి చేశారు. ఈనెల 20న కోవూరు మండలంలోని ఇనమడుగు గ్రామంలో అనేకమంది పేద చేనేత కుటుంబాల వారికి ఆయన ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో చేనేత కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు కరోనా బారిన పడి మరణించిన నేత కుటుంబాల వారు ఉపాధి కరువై అల్లాడుతున్నారన్నారు. అలాంటి వారిని వెంటనే ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఆయన కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు సురేష్ బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# 'యోగ' సాధనతో మానసిక సంతులనం

## - భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో..ఎప్పుడో వేనవేల ఏళ్ల సంవత్సరాల క్రితం మన ప్రాచీన భారతీయ సనాతన సంప్రదాయంలో ప్రభవించిన 'యోగ' అటు శారీరక ఆరోగ్యాన్ని, ఇటు మానసిక స్థైర్యాన్ని ప్రసాదించే ఒక దివ్యౌషధంగా మారిందని ప్రపంచమంతా గుర్తించిన నేటి తరుణంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న భారత ఉప రాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు దంపతులు ఈనెల యోగ సాధన చేసి యోగ ప్రాశస్త్యాన్ని లోకానికి మరింతగా చాటారు. యోగ..మానసిక సంతులనాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. తన సతీమణి ఉషమ్మతో కలసి ఆయన యోగ సాధన చేసి అందరికీ యోగా పట్ల మరింత అవగాహనను, స్ఫూర్తిని కలిగించారు.

# కరోనా మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కరోనా బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, కనీసం వారి కుటుంబాలనైనా అన్ని విధాలా ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య అన్నారు. ఈనెల 19న టిడిపి ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా ఆక్సిజన్ అందక మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కరోనా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు సత్యనాగేశ్వరరావు, కప్పిర శ్రీనివాసులు, సాబిర్‌ఖాన్, అన్నంగి ప్రసాద్ పాల్గొన్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

వారం వారం ప్రత్యేక కథనాల సంచలనం
నెల్లూరు జిల్లా సమగ్ర సమాచార సంకలనం
లాయర్ వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాభినందనలు.

ఫణి తాళ్ళూరు



BTREE SOLUTIONS
13800 Coppermine Rd, Herndon, VA 20171, USA

• చదువులో ఫస్ట్... నాట్యంలో బెస్ట్

## బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్న

# అమెరికా అమ్మాయి.. లాస్య గడ్డిపాటి



**ఆ అమ్మాయి పుట్టింది అమెరికాలో, పెరిగిందీ అమెరికాలోనే. భారతీయ సంస్కృతి సంప్రదాయాలంటే చిన్నప్పటి నుండి చాలా ఇష్టం. కూచిపూడి నాట్యమంటే ప్రాణం. పదేళ్ళ ప్రాయంలోనే ఆ అమ్మాయి కూచిపూడిలో రంగప్రవేశం చేసింది. ఆ అమ్మాయి పేరు లాస్యలక్ష్మి.**

తండ్రి సుధీర్ గడ్డిపాటి – తల్లి ప్రియా కొర్రపాటి. ఇద్దరూ ఐటి ప్రొఫెషనల్స్, అమెరికాలో స్థిరపడిపోయారు. సుధీర్‌ది గుంటూరు జిల్లా పొన్నూరు, ప్రియాది నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలం పల్లవోలు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కీర్తిశేషులు కొర్రపాటి కుమారరాజా చౌదరి కుమార్తె ప్రియ. వారి ఇంటి మహాలక్ష్మి చిన్నారి లాస్య. లాస్య తన చదువుకి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో.. కూచిపూడి నాట్యమంటే కూడా అంతే ప్రాముఖ్యత ఇస్తుంది. అమెరికాతో పాటు భారతదేశం, లండన్‌లతో కలిపి ఆ అమ్మాయి ఇప్పటివరకూ వందకుపైగా నృత్య ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నాదనీరాజనం ప్రధాన వేదికపై లాస్య చేసిన నాట్యాన్ని యస్‌విబిసి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసిందంటే ఆ అమ్మాయి ప్రతిభ ఏపాటిదో మనం వూహించుకోవచ్చు. తమ కుటుంబం ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లా ఉదయగిరిలో ప్రతి యేడాది జరిగే ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహణలో కూడా లాస్య చాలా చురుకుగా పాల్గొనేది.

### న్యూజెర్సీ గవర్నర్ అవార్డు



ఒక వైపు నాట్యం, మరో వైపు పెయింటింగ్... వీటితో పాటు సమాజ సేవ. న్యూజెర్సీలో తాను చదివిన రిడ్జ్ హైస్కూల్‌లో చదువుతో పాటు అన్నిటిలోను లాస్య నంబర్ వన్. లాస్య చేస్తున్న సామాజిక సేవ, వివిధ రంగాలలో ఆమె కనబరుస్తున్న అసామాన్య ప్రతిభ అమోఘం. ఇటీవల ప్రతిష్టాత్మకమైన న్యూజెర్సీ గవర్నర్ అవార్డుకి కూడా లాస్య ఎంపికయ్యింది. పలు అంశాలలో జరిగే వక్తృత్వ పోటీలలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలోనూ, జాతీయ స్థాయిలో 4వ స్థానంలోనూ నిలిచినందుకుగాను లాస్యను ఈ అవార్డు వరించింది. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన వాళ్ళని జాతీయస్థాయికి పంపిస్తారు. కొన్ని వేలమంది పాల్గొనే ఈ పోటీలలో ఈ స్థానాలు సాధించడమంటే సామాన్యమైన విషయం కాదు. ఇటీవలే లాస్య ఆ అవార్డును అందుకుంది. తమ బిడ్డకు ఉన్నత చదువుతో పాటు విలువలను, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను నేర్పిస్తున్న ఆ అమ్మాయి అమ్మానాన్నలకు 'లాయర్' హ్యాట్సాఫ్. లాస్యకు 'లాయర్' అభినందనలు.



## సియాచిన్ లోయ వద్ద 'మన సతీష్‌రెడ్డి' యోగసాధన



అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న సరిహద్దుల్లోని సియాచిన్ వద్ద నుబ్రా లోయ ప్రాంతంలోని ఆర్మీక్యాంప్‌లో యోగాసనాలు వేసి యోగ ప్రాశస్త్యాన్ని చాటుతున్న డిఆర్‌డిఓ ఛైర్మెన్.. మన నెల్లూరీయుడు సతీష్‌రెడ్డి.

## టౌన్‌ప్లానింగ్ ఏసిపిగా హయత్ మెదిన్

నెల్లూరు కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీప్లానర్(ఏసిపి)గా మదనపల్లి మునిసిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హయత్‌మొదీన్‌ను నియమించడంతో ఆయన ఇటీవల నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు.






# పోలీసు కుటుంబాలకు భద్రత చెక్కులు



విధి నిర్వహణలో మృతిచెందిన పలువురు పోలీసుల కుటుంబాలకు జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఈనెల 20న భద్రతా చెక్కులను పంపిణీ చేశారు. కానిస్టేబుల్ వేణుగోపాలరెడ్డి భార్య హరితకు 4 లక్షల రూపాయలు, మెరైన్ పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన శ్యామ్‌సునీల్ భార్య కస్తూరిరాణికి 8 లక్షల రూపాయల చెక్కులను ఎస్పీ అందజేశారు. అదేవిధంగా తోటపల్లిగూడూరులో కానిస్టేబుల్‌గా ఉంటూ కరోనాతో మరణించిన రామబ్రహ్మం భార్య లావణ్యకు 4 లక్షలు, 'దిశ' పోలీస్‌స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మరణించిన రవి భార్య శిరీషకు 4 లక్షల రూపాయల వంతున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) వెంకటరత్నం, బి-4 సెక్షన్ క్లర్క్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రిలో జేసీ ఆకస్మిక తనిఖీలు

కరోనా బాధితులకు అందుతున్న సేవలు ఎలా ఉన్నాయో ఆరా తీస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఈనెల 21న పెద్దాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఐసియు వార్డును పరిశీలించి ఎన్ని వెంటిలేటర్లు పనిచేస్తున్నాయి..ఆక్సిజన్ పరికరాల పరిస్థితి ఎలా ఉందంటూ అధికారులను వివరాలడిగారు. రికార్డుల్లో ఉన్న మందులు వివరాలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అసౌకర్యం లేకుండా బాధితులకు సేవలందించాలని అధికారులకు, సిబ్బందికి చెప్పారు. జేసీ వెంట పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు, డ్రగ్‌స్టోర్ ఇఇ విజయ భాస్కర్‌రెడ్డి, ఫార్మాసిస్ట్ యశోద, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# సీరో సర్వైలెన్స్‌పై డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆరా

నెల్లూరు నగరంలో ఎంతమందికి కరోనా వచ్చి, తగ్గిపోయి ఉండవచ్చనే విషయాన్ని తెలుసుకునేందుకు జరుగుతున్న సీరో సర్వే ఎలా జరుగుతుందోనని ఈనెల 12న డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. స్థానిక ఇరుకళల పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయం సమీపంలోని ప్రాంతాల్లో ఈ సర్వే గురించి ఆరా తీశారు. అక్కడి ప్రజల ఆరోగ్యం గురించి వాకబు చేశారు.

# రక్తదానం చేసిన 'సేవాభారతి'

హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నెల్లూరులోని సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఏసి నగర్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో యువకులు, విద్యార్థులు, మహిళలు పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ రక్తనిధి ఆ రక్తాన్ని సేకరించింది. ఆర్‌ఎస్‌ఎస్ నగర జాయింట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, సేవాభారతి నగరప్రముఖ్ చక్రవర్తి, రామలింగేశ్వరశర్మ, కిరణ్ పాల్గొన్నారు


# డికెడబ్ల్యు కాలేజీకి అవార్డు

నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీ యూత్ రెడ్‌క్రాస్ విభాగం రెడ్‌క్రాస్ జిల్లా స్థాయి గోల్డ్ ఇన్‌స్టిట్యూషన్ అవార్డుకు ఎంపికైంది. ఈనెల 21న ఆ అవార్డును కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మస్తానయ్యకు రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. కళాశాల యూత్ రెడ్‌క్రాస్ విభాగాన్ని, కళాశాల నిర్వాహకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

# విద్యుత్‌శాఖ డిఇగా సోమశేఖర్‌రెడ్డి

విద్యుత్‌శాఖ నెల్లూరు నగర డెప్యూటీ ఇంజనీర్‌గా సోమశేఖర్‌రెడ్డి ఇటీవల బదిలీ అయి వచ్చారు. గూడూరులో డిఇగా పనిచేస్తున్న ఆయన్ను నెల్లూరుకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టాక విద్యుత్‌శాఖ ఎస్‌ఇ ఆదిశేషయ్యని మర్యాదపూర్వకంగా కలిశారు.

# 'వాత్సల్య'లో యోగ దినోత్సవం



అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని జనహిత-వాత్సల్య అనాధ శరణాలయంలోని చిన్నారులు యోగ సాధన చేసి అందరినీ ఆకట్టుకున్నారు. శారీరక ఆరోగ్యానికి, మానసిక వికాసానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వాత్సల్య నిర్వాహకులు పేర్కొన్నారు. జనహిత-వాత్సల్య నిర్వాహక కార్యదర్శి జివి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల అవస్థలు పట్టించుకోరేం?

## తెలుగురైతు నాయకుల ఆందోళన

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ ఇటీవల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రెండు నెలలు దాటిపోతున్నా ప్రభుత్వం ధాన్యం బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు అనేక బాధలు పడుతున్నారని, ఇకనైనా రైతుల పరిస్థితిని గమనించి వెంటనే సమస్యలు తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. తిరుపతి, నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గాల తెలుగురైతు అధ్యక్షులు రావూరి రాధాకృష్ణ నాయుడు, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.


**స్థలం అమ్మబడును**

1. పొగతోటలోని Dr. P.L.Rao Hospital ప్రక్కన 155 అంకణములు
2. Old SBH రామమూర్తినగర్ దగ్గర 84 అంకణములు

Contact: P.Venkat 95422 51891

Note: Only Genuine persons must call




# శ్రీసిటీ ఐఎంఐ పరిశ్రమ వితరణ

- 140 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు



శ్రీసిటీలోని ఐఎంఐ పరిశ్రమ స్థాపక దినోత్సవం సందర్భంగా ఇటీవల శ్రీసిటీ పరిసరాల్లోని 40 గ్రామాల్లో ఉన్న 140 కుటుంబాల గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు వెయ్యి రూపాయల విలువగల నిత్యావసర సరుకులను ఒక్కో కిట్‌గా చేసి అందించారు. శ్రీసిటీ డిఎస్పీ జగదీష్‌నాయక్, సిఐ శ్రీనివాసులు, ఐఎంఐ–సిసిఐ ప్లాంట్ హెడ్ ప్రభు, శ్రీసిటీ ప్రతినిధులు భానురెడ్డి, రమేష్, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి



రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సాదు నరసింహారెడ్డి ఈనెల 20న శ్రీసిటీని సందర్శించి, శ్రీసిటీ ప్రగతిని అభినందించారు. దేశంలో అత్యుత్తమ పారిశ్రామికవాడల్లో ఒకటిగా శ్రీసిటీ ప్రఖ్యాతి చెందేందుకు శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డితో పాటు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్స్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, కెవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో కొరత లేకుండా..

# నీటిపారుదల ప్రాజెక్టులు

- 3300 కోట్లతో అభివృద్ధి పనులు
- సూళ్లూరుపేటలో వంద కోట్లతో 50 చెక్‌డ్యామ్‌లు

**- మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ వెల్లడి**



వైకాపా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్ళకాలంలోనే జిల్లాలో నీటిపారుదల రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ 3300 కోట్లతో నీటిపారుదల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని, జిల్లా చరిత్రలోనే ఇదొక సువర్ణాధ్యాయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత భారీఎత్తున నీటి పారుదల అభివృద్ధి పనులు జరగలేదన్నారు. సిఎం అండతో నీటిప్రాజెక్టుల పనులు ఊపందుకుంటున్నాయన్నారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో ఆ నియోజకవర్గంలోని నెర్రికాలువ, పాములకాలువ, ఆనకట్ట మరమ్మతులు, పాలచ్చూరు, భీమవరం, పున్నేపల్లి కాలువల ఆధునీకరణ, కాళంగి డ్రెయిన్ నిర్మాణాలకు సుమారు 80 కోట్లతో పనులు చేయడానికి సూళ్ళూరుపేటలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఈనెల 20న శిలాఫలకాలను మంత్రి అనిల్ ఆవిష్కరించారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నీటి ప్రాజెక్టులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, సిఎం చొరవతో రాష్ట్రంలో ఎన్నో నీటి ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని అన్నారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో సుమారు నూరుకోట్ల రూపాయల వ్యయంతో 50 చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహరహం శ్రమిస్తున్న ఎమ్మెల్యే సంజీవన్న తీసుకొచ్చిన ప్రతిపాదనలకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే అనుమతి ఇచ్చారని ఆయన చెప్పారు. తిరుపతి ఎంపి గురుమూర్తి, జేసీ హరేందిరప్రసాద్, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బల్లి కల్యాణ్‌చక్రవర్తి, వైకాపా నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, చెంగాళమ్మ ఆలయ ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సూళ్ళూరుపేట, నాయుడుపేట మునిసిపల్ ఛైర్మెన్లు దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కటకం దీపిక తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# టీకా వేయడంలో మనమే ముందంజ

*కరోనా మహమ్మారిని నిరోధించేందుకు చేస్తున్న కృషిలో భాగంగా చేస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియలో దేశంలో మనరాష్ట్రం ముందంజలో ఉండడం విశేషం. ఈనెల 20వ తేది ఆదివారం ఒక్కరోజులోనే రాష్ట్రవ్యాప్తంగా 13.45 లక్షల మందికి టీకా వేసి దేశంలో 'నేనే నెంబర్ 1' అనిపించుకుంటూ ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంది. మెగా వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టిస్తూ దేశంలోనే అగ్రగామిగా ముందుండడం ఒక విశేషమైతే, ఈ ప్రక్రియలో రాష్ట్రంలో నెల్లూరుజిల్లా నెంబర్-1గా నిలవడం మరో విశేషం.*

- దేశంలో ఆంధ్రాయే.. అగ్రగామి
- రాష్ట్రంలో నెల్లూరు జిల్లా నెంబర్ 1
- ముందస్తు ప్రణాళికలతోనే సత్ఫలితాలు





కోవిడ్ నియంత్రణ చర్యల్లో మన రాష్ట్రం జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. టీకాతోనే కరోనా కట్టడి సాధ్యం కనుక గతంలో టీకా అంటే వెనుకంజవేసిన వారు కూడా ఇప్పుడు టీకా పట్ల మంచి అవగాహనతో టీకా వేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. టీకా పట్ల మునుపటికంటే ఇప్పుడు అవగాహన బాగా పెరిగింది. 'టీకా ఒక్కటే..మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష' అనే చైతన్యంతో ప్రజలు టీకా అనగానే ముందుకు వచ్చి టీకా వేయించుకుంటున్నారు. ఆమేరకు తగు చైతన్యాన్ని ప్రజల్లో కల్పిస్తూ, అందుకు తగ్గట్టుగా సరైన ప్రణాళికలు అమలుచేస్తూ టీకా ప్రక్రియను వేగవంతంగా అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కక్షణం కూడా వృధాకాకుండా ఈ ప్రక్రియను చేపడుతుండడంతో దేశంలోనే మన రాష్ట్రం వ్యాక్సినేషన్‌లో సరికొత్త రికార్డులు సాధిస్తోంది.

## జాతీయస్థాయిలో ఏపీ రికార్డు

రాష్ట్రంలోని కోట్లాదిమంది ప్రజలకు కోవిడ్ వ్యాక్సిన్ వేయాల్సిన నేటి పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న ముందుజాగ్రత్త చర్యలు ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తున్నాయి. టీకా వేయడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వడం, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కూడా వ్యాక్సిన్ కేంద్రాలను ఏర్పాటుచేయడం, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు ఉండడం వల్ల వాళ్ళు ఎప్పటికప్పుడు టీకాపై ఆయా ప్రాంతాల ప్రజల్లో అవగాహన కలిగించడం వంటి చర్యల ద్వారా దేశంలోనే రాష్ట్రం ఇప్పుడు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో ముందుంటోంది. గతంలో ఒకేరోజు 6 లక్షల మందికి టీకా వేసిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఆ రికార్డును తానే అధిగమించి 13.45 లక్షల మందికి టీకా వేసి జాతీయస్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది.

## విజయవంతంగా చర్యలు

కేంద్రం నుంచి వ్యాక్సిన్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యల వల్ల వెంటనే అన్ని జిల్లాలకు జాప్యం లేకుండా తరలించి, ఆయా జిల్లాల్లోని వ్యాక్సినేషన్ సెంటర్లకు పంపిణీ చేస్తుండడంతో ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. అందుకు తగ్గట్టుగా వ్యాక్సిన్ వేసేందుకు టీకా కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండడంతో వ్యాక్సిన్ వేయించుకునే ప్రజలు ఎక్కువసేపు క్యూలలో వేచి ఉండకుండా త్వరితగతిన టీకా వేసుకుంటున్నారు. వ్యాక్సిన్ వేయించుకునేవారికి ముందుగానే సమాచారం అందజేసి వారు సరైన సమయానికి వ్యాక్సిన్ కేంద్రాలకు వచ్చేలా వలంటీర్లు అవగాహన కల్పిస్తుండడంతో ఈ ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది.

## జిల్లాలో ఒకే రోజు 78,240 మందికి టీకా

మెగా టీకా ప్రక్రియలో భాగంగా నెల్లూరుజిల్లాలో ఒకేరోజు, ఈనెల 20వ తేదిన 78,240మందికి కోవిడ్ టీకా వేసి జిల్లా రాష్ట్రంలోనే నెంబర్-1గా నిలిచింది. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో, జేసీ గణేష్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అంతా ఒక్కటై ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పిహెచ్‌సిలు, యుహెచ్‌సిలు, సచివాలయాలు, ప్రభుత్వాసుపత్రుల్లో.. మొత్తంగా 91 కేంద్రాల్లో 455 మంది సిబ్బంది పాల్గొని టీకా వేశారు. ఈ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లులకు, 45 ఏళ్ళు నిండిన వాళ్ళకి, విదేశాలకు వెళ్ళేవారికి ప్రాధాన్యత ఇచ్చి వ్యాక్సిన్ వేయడం జరిగింది. నెల్లూరులోని క్రాంతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటిదాకా 8.65 లక్షల మందికి తొలిడోసు వ్యాక్సిన్‌ను, 2.25 లక్షల మందికి రెండోడోసు వ్యాక్సిన్‌ను వేశామని, వ్యాక్సినేషన్ ప్రక్రియలో రాష్ట్రంలోనే మనజిల్లా ప్రథమ స్థానంలో ఉండడం సంతోషకరమన్నారు. జిల్లాలో ఫ్రంట్‌లైన్ వారియర్స్ 97శాతం మందికి టీకా పూర్తి చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లను, అందరినీ ఆయన ఈ సందర్భంగా అభినందించారు.



# జనం కలలను సాకారం చేస్తున్న సిఎం జగన్

## - కొనియాడిన ఎమ్మెల్యే కాకాణి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కలలను సాకారం చేస్తున్నారని, ఎంతో పారదర్శకంగా పరిపాలన సాగిస్తూ ప్రజలందరి అభిమానానికి పాత్రులవుతున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల మనుబోలు పంచాయతిలోని యాచవరం గ్రామంలో 66 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డుకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు. పేదప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో టిడిపి హయాంలో ఏ పనీ సక్రమంగా జరిగేది కాదని, జన్మభూమి సభ్యుల సంతకాలు లేకపోతే పింఛను కూడా ఇచ్చేవారు కాదని, ఇప్పుడు పింఛను కావాలని సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి వెంటనే వలంటీరు ద్వారా పింఛను నగదు ఇంటికే వస్తోందని చెప్పారు. జిల్లాలోనూ, రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వ్యయం చేసే అభివృద్ధి, సంక్షేమ పనులను నిరంతరం అమలుచేస్తూ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి సిఎం జగన్ పాటుపడుతున్నారన్నారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఒకే ఒక్కరోజులో లక్షలాది మందికి టీకా వేయించిన ఘనత కూడా సిఎం జగన్‌దేనని ఆయన ఈ సందర్భంగా



కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచి పద్మమ్మ, తహశీల్దారు నాగరాజు, వైకాపా నాయకులు చల్లా నవకోటి, శంకరయ్య, రవీంద్రరెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ఏడెం మల్లికార్జున్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వివిఎస్‌యు యూత్ రెడ్‌క్రాస్‌కు అవార్డు

నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీలోని యూత్ రెడ్‌క్రాస్ విభాగం సేవలకు మంచి గుర్తింపు లభించింది. 2019-20 సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో కాంశ్యపతకానికి ఎంపికైంది. ఇటీవల నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో




రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డికి ఈ అవార్డును అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎల్‌వికె మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం చేసిన కార్యక్రమాలతో ఈ గుర్తింపు లభించిందన్నారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## నార్త్‌రాజుపాళెం అభివృద్ధి పనులకు..

# కలెక్టర్, ఎమ్మెల్యే ప్రసన్న శంకుస్థాపన



కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాళెం గ్రామంలో 1.52 కోట్లతో సెంట్రల్ లైటింగ్, 60 లక్షల రూపాయల వ్యయంతో సైడ్ డ్రెయిన్ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి ఈనెల 21న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎన్నో రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అందజేయడం జరుగుతోందని చెప్పారు. ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి చెందాలనే ధ్యేయంతో కృషి చేస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరి చలపతిరావు, కొండూరు అనిల్‌బాబు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు రాక..ఆయాల అవస్థ

## పెండింగ్ వేతనాలివ్వాలని ఏపిటిఎఫ్ వినతి

జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్‌లో ఉన్న జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లాశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సురేంద్రరెడ్డి, ఎం.పిచ్చిబాబు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొన్నిచోట్ల 5 నెలలుగా, ఇంకొన్ని చోట్ల 10 నెలలుగా ఆయాల జీతాలు పెండింగ్‌లో ఉండడంతో ఆయాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ, జీతాలిచ్చి వారిని ఆదుకోవాలని కోరారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

నెల్లూరు సమాచార సమాహారం
స్థానిక పత్రికలలో మణిహారం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



పి.వి.ప్రసన్నరెడ్డి
Executive Director,
GVK Power & Infrastructure Ltd.,

# అదేంటో.. ఫ్చ్... బాబును చూస్తుంటే జాలేస్తోంది...!

తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రయాణం సాగుతున్న తీరు చూస్తుంటే... ఒక్కొక్కసారి ఆశ్చర్యం వేస్తుంటుంది. ఒక్కొక్కసారి జాలి వేస్తుంటుంది. ఇప్పుడు ఆయనకు 73 ఏళ్ల వయసు వచ్చింది. అయినా... ఆంధ్ర ముఖ్యమంత్రిని గానీ, ఆంధ్రాలో ఏదైనా ఒక సంఘటన చోటు చేసుకున్నప్పుడు గానీ... దానిమీద 'ఆగ్రహ'మో, 'అసహన'మో, ఆవేదనో, 'మనం ఎక్కడికి పోతున్నామో' అంటూ నిర్వేదమో వ్యక్తం చేయకుండా ఉండలేకపోతున్నారు. నిజానికి, అవన్నీ వ్యక్తం చేయడానికి జూనియర్ చంద్రబాబునాయుడు లోకేష్ విజయవాడలోనే ఉంటున్నారు. చంద్రబాబునాయుడు హైదరాబాద్ నుంచి వ్యక్తం చేస్తున్నవన్నీ.. విజయవాడ నుంచి లోకేష్ వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ, రాజకీయ పరుగు పందెంలో వెనుక పడిపోగూడదనే భావనతో కావచ్చు ఆయన 'జూమ్'ను వదిలిపెట్టడం లేదు. కానీ, ఆయన విషయంలో – 'లా ఆఫ్ డిమినిషింగ్' అనే ఆర్థికశాస్త్ర సూత్రీకరణ ఒకటి గట్టిగా పని చేస్తున్నట్టు కనపడుతున్నది. ఏదైనా 'అతి' చేస్తే... ఆశించిన ఫలితం రాకపోగా... ఫలితానికి రివర్స్ గేర్ పడుతుంది అని అర్థం చేసుకోవచ్చు.

2014లో రాష్ట్రం విడిపోయిన తరువాత సింగపూర్‌ను తలదన్నే రాజధాని అంటూ రేయింబవళ్లు చంద్రబాబు ఊదరగొట్టారు. ఇప్పుడు అసలు రాజధానే లేకుండా పోయింది. పోలవరం... సోమవరం అంటూ ఊదరగొట్టారు. బస్సుల్లో జనాలను రోజూ తోలుకువెడుతూ...వారి రవాణా, భోజన సౌకర్యాలకు వందల కోట్లు గోదారిలో పోసేశారు. అది ఇప్పుడు... ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియదు. హైదరాబాద్‌ను నేనే డెవలప్ చేశాను అంటూ పాట పాడేవారు. ఇప్పుడు నోరెత్తడం లేదు. హైదరాబాద్‌లోనే ఇప్పుడు ఓ ప్రవాసఆంధ్రుడిలా కాలం గడుపుతున్నారు. హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ అభివృద్ధికోసం అమెరికాలో కాలినడకన.. వర్షంలో కూడా తిరిగాను అంటారు. ఆ విషయం కనీసం ప్రస్తావించే పరిస్థితుల్లో ఆయన ఇప్పుడు లేరు. మొన్నటి 2019 ఎన్నికలకు ముందు...ప్రధాని మోదీని తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టారు. నల్ల దుస్తులు ధరించారు. ధర్మాగ్రహం అన్నారు. ఢిల్లీలో ధర్నాలు చేశారు. ఢిల్లీలో రాహుల్




గాంధీ ఇంటికి వెళ్లారు. మీకు అండగా ఉంటాను అన్నారు. బెంగళూరు వెళ్లారు. కుమారస్వామీ... మోదీని చూసి భయపడకు, నేనున్నానూ అని చంద్రబాబు అన్నారు. ప్రచారం హోరెత్తిపోయింది. ఇప్పుడు... మోదీని చూస్తుంటే... బాబుకు చెమటలు పడుతున్నాయి. 2019 తరువాత, మోదీని ఆయన ఒక్క మాట అనలేదు. మోదీనే కాదు. తనను నిత్యం విమర్శించే బీజేపీ ఆంధ్ర శాఖ నేతలను కూడా చంద్రబాబు పల్లెత్తు మాట అనడం లేదు.

పోనీ, ఎన్నికలముందు రాహుల్‌గాంధీని రాసుకు... పూసుకు తిరిగిన చంద్రబాబు ఎన్నికల తరువాత ఆయన వైపు కన్నెత్తి చూశారా అంటే... పొరపాటున కూడా చూడలేదు.

2018లో తెలంగాణ ఎన్నికల ముందు కేసీఆర్‌ను తూర్పారబడుతూ హైదరాబాద్‌లో వీధివీధినా రోడ్‌షోలు కాంగ్రెస్‌వారితో కలిసి నిర్వహించిన చంద్రబాబు.. ఎన్నికలయ్యాక... మళ్లీ తెలంగాణ పేరెత్తితే ఒట్టు. హైదరాబాద్ నగరాన్ని 2004 దాకా చక్రవర్తిలా పాలించిన చంద్రబాబు... ఇప్పుడు, హైదరాబాద్‌లోని కోటిన్నర జనాభాలో ఒకరిగా... చప్పుడు చేయకుండా జీవిస్తున్నారు. ఆయన హైదరాబాద్‌లో ఉంటున్న సంగతి కూడా తెలంగాణ టీడీపీకి గానీ తెలంగాణ ప్రభుత్వానికి గానీ సోయిలో లేదు. తెలంగాణలో బ్రహ్మాండం బద్దలైనా సరే... చిన్న వ్యాఖ్య కూడా చేయడం లేదు. తన మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన కేసీఆర్... తన కళ్ళ ముందే ముఖ్యమంత్రి అయి, తనను గుడ్డి వెంట్రుకగా చూస్తుంటే... చంద్రబాబు నోరు మెదపడం లేదు. ఇలా అన్నీ ఎదురు తిరగడానికి కారణం.. ఆయన గతంలో చేసిన ఓవర్ యాక్షన్లు. అధికారం ఉంటే ఆయన మనిషి కాదు. నీతుల పుట్ట. అధికారం పోయాక... పాత ఓవర్ యాక్షన్లు ఇప్పుడు చుట్టుముట్టాయి. అందుకే... ఆయన నోరు మెదపలేని స్థితిలో ఉన్నారు. అందుకే అన్నారు పెద్దలు... 'అధికారాంతమందు చూడవలె... అయ్య సౌభాగ్యముల్..' అని.



**- భోగాది వేంకట రాయుడు**
bv rayudu @ YouTube

# అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవాలి

## అధికారులు, సిబ్బందికి సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఆదేశం

జిల్లాలో మద్యం, ఇసుక, గంజాయి అక్రమరవాణాతో పాటు అన్నిరకాల అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకునేందుకు సెబ్ అధికారులు దాడులు ముమ్మరం చేయాలని, అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఈనెల 21వ తేదిన సెబ్ ఆధ్వర్యంలో నేరసమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం మానసపుత్రికల్లో ఎస్ఇబి ఒకటని, సిబ్బంది కష్టపడి పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలని అన్నారు. నాటుసారా స్థావరాలు, గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు తదితర చట్టవ్యతిరేక కార్యక్రమాలపై నిఘాపెట్టి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పోలీసుల సహకారంతో వాటిని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన 11 మంది సిఐలు, 23 మంది ఎస్ఐలకు జేడీ దిశానిర్ధేశం చేశారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అక్రమాలను, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవాలని, సెబ్ శాఖకు మంచిపేరు తేవాలని చెప్పారు. విధి నిర్వహణలో ఎవరు అలసత్వం ప్రదర్శించినా, అవినీతి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు వెంకటేశ్వర రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూత

కరోనా నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న అంధులు, దివ్యాంగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు చేజర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఇటీవల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న స్వర్ణదీపం ఆశ్రమంలోని దివ్యాంగులకు తమవంతు చేయూతనందించారు. ప్రభుత్వ, ప్రైవేట్ అధికారులు, ఉద్యోగులు, రిటైరైన ఉద్యోగుల సహకారంతో వారికి నెలరోజులకు సరిపోయే బియ్యం, నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, సుశీలమ్మ, దొరసానమ్మ, పరిమళ, ఇందిర, ప్రఫుల్ల తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను..
# వెంటనే పూర్తిచేయాలి
### - అధికారులకు ఎమ్మెల్యే ఆనం సూచన



వెంకటగిరి నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులు నిర్ధేశించిన లక్ష్యాల ప్రకారం ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. ఈనెల 21న ఆయన బాలాయపల్లిలో అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులను సమీక్షించారు. ఇతర మండలాలతో పోలిస్తే బాలాయపల్లి మండలం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, ఈ మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ మండలంలో చేపడుతున్న పనులకు అవసరమైన నిధులన్నీ మంజూరయ్యాయని, పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సత్యసాయి గంగ కాలువ నుంచి 5వ బ్రాంచ్ కెనాల్ మీదుగా క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణానికి 70 లక్షలు మంజూరయ్యాయని, వెంకటగిరి నుంచి బాలాయపల్లి మీదుగా తిప్పవరప్పాడు దాకా పది మీటర్ల వెడల్పుతో నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి కూడా 45 కోట్లు వచ్చాయని అధికారులు ఆ పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సింగంశెట్టి భాస్కర్‌రావు, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, రాయి దేవికాచౌదరి, బట్టేపాటి మురళీమోహన్‌రెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, మస్తాన్‌నాయుడుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిపిఎం ధర్నాందోళన

పెట్రోలు, డీజల్ ధరలను తగ్గించాలంటూ నెల్లూరులో సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 20న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పెట్రోలు, డీజల్ ధరలు పెరగడంతో అన్ని ధరలు పెరిగి సామాన్యప్రజలు బతకలేకపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల శాఖ కార్యదర్శి తుళ్ళూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిదేవి స్కూల్‌లో
# టీకా కేంద్రం
### - ప్రారంభించిన కలెక్టర్

నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి స్కూల్ ఆవరణంలో అపోలో, నారాయణ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3.80 లక్షల మంది దాకా చిన్నారుల తల్లులు ఉన్నట్లు గుర్తించామని అయిదేళ్ళ లోపు పిల్లలున్న తల్లులందరికీ కోవిడ్ నిరోధానికి టీకా ఇచ్చే కార్యక్రమం జిల్లాలో విస్తృతంగా జరుగుతోందన్నారు. ఆర్టీసి బస్టాండ్, ఫతేఖాన్‌పేట, సరస్వతినగర్ తదితర ప్రాంతాల ప్రజలకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. విదేశాల్లో చదువుకునేందుకు వెళ్ళే విద్యార్థులకు కూడా వ్యాక్సిన్ అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 3.40 లక్షల మందికి టీకా వేయడం జరిగిందన్నారు. ప్రైవేటాసుపత్రుల సహకారంతో నగరంలో కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 18 ఏళ్ళు దాటిన వారు ఈ కేంద్రాల్లో టీకా వేయించుకోవచ్చన్నారు. కోవిడ్ సైట్‌లో పేరు నమోదు చేసుకుని వ్యాక్సినేషన్ సెంటర్లకు వచ్చి టీకా వేయించుకోవాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, స్థానిక నారాయణ, అపోలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# కరోనా కట్టడికి.. జగనన్న పటిష్ట చర్యలు
### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



రాష్ట్రంలో కరోనా మహమ్మారి వ్యాధిని కట్టడి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 21న నాయుడుపేటలోని ఆర్‌డిఓ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ ప్రబలకుండా జగనన్న ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ నిరంతరం చర్యలు తీసుకుంటుండడంతో ఆ వ్యాధి వ్యాప్తి తగ్గుముఖం పట్టిందన్నారు. అనంతరం చిత్తూరుజిల్లాకు చెందిన గ్రీన్ ప్యానల్ ఇండస్ట్రీస్ యాజమాన్యం వారు ఎమ్మెల్యే సమక్షంలో ఆర్డీఓ సరోజినికి 4 లక్షల రూపాయల విలువచేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందజేయగా, కరోనా బాధితులకు అండగా ఆ పరిశ్రమ వారు చేస్తున్న సాయాన్ని ఆయన అభినందించారు. నాయుడుపేట, సూళ్ళూరుపేట పిహెచ్‌సిలలో కోవిడ్ బాధితులకు చికిత్సలు చేసేందుకు ప్రత్యేక కోవిడ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని చెప్పారు. గ్రీన్ ప్యానల్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు నందకిషోర్, జి.ఎం బాలాజీ, ఎన్‌డిసిసిబి మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, వైకాపా నాయకులు ఒట్టూరు కిశోర్‌యాదవ్, పోట్లపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుళ్ల ఔదార్యం



కరోనాతో మరణించిన ఓ కానిస్టేబుల్ కుటుంబానికి సహచర కానిస్టేబుళ్ళు కొందరు ఆర్ధికసాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. తమవంతుగా 2,41,200 రూపాయలను వారికి అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల కరోనాతో మృతిచెందిన కానిస్టేబుల్ రామబ్రహ్మం కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లాలో పనిచేస్తున్న 2013 బ్యాచ్ కానిస్టేబుళ్ళు ఈనెల 21న ఆ మొత్తాన్ని రామబ్రహ్మం భార్యాపిల్లలకు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కానిస్టేబుళ్ళు రాజా, నవీన్, శ్రీహరి, క్రాంతి పాల్గొన్నారు.




# ఆత్మబంధువు.. ముఖ్యమంత్రి జగన్

## పేదలను గృహప్రవేశం చేయించిన ఎమ్మెల్యే ప్రసన్న



రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ళు కట్టిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆత్మబంధువుగా నిలిచారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 23న కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేటలో ఇళ్ళ లబ్దిదారులకు గృహప్రవేశం చేయించి వారందరినీ ఆనందింపజేశారు. నవరత్నాల పథకాలతో ముఖ్యమంత్రి జగన్ అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమపథకాలను అందజేస్తున్నారని, కులమతాలు రాజకీయాలకు అతీతంగా సిఎం అమలుచేస్తున్న పథకాలు ఎంతోమంది ప్రజలకు చేరువవుతున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ మవులూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లపల్లి విజయకుమార్, నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కైలాసం ఆదిశేషారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### కొండబిట్రగుంటలో

## మహారాజగోపురానికి శంకుస్థాపన



రాజగోపురం శంకుస్థాపనకు పూజాసామాగ్రిని మోసుకొస్తున్న దాతలు

బోగోలు మండలంలోని కొండ బిట్రగుంటలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 20న మహారాజ గోపురం నిర్మాణానికి ఎంతో వైభవంగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. నారద మహాముని ప్రతిష్టించిన ఆలయంగా, బిలకూట క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ దేవాలయంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు పాతిక కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆలయానికి తూర్పువైపున మహారాజగోపుర నిర్మాణానికి కావలి ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఆయన మిత్రులు ఈతముక్కల మురళీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితర భక్తులు ముందుకు వచ్చి సుమారు 2.35 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న ఈ గోపుర నిర్మాణానికి శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేసి ప్రత్యేకపూజలు జరిపారు. విజయవాడకు చెందిన ప్రముఖ యాజ్ఞికులు వంశీకృష్ణమాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు వేదగిరి వేంకటలక్ష్మీనృసింహాచార్యుల ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ శ్రీరాం మాల్యాద్రి, ఇ.ఓ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## పెంచలకోనలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్ర వేడుకలు

- వైభవంగా కల్యాణోత్సవం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచల కోనలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం(స్వాతి) రోజును పురస్కరించుకుని ఈనెల 21న ఎంతో వైభవంగా స్వామివారి మూలమూర్తికి చందనాలంకారం చేసి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో, పండ్లరసాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తిని బంగారు గరుడవాహనంపై కొలువుదీర్చి శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారి దేవేరులైన ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి శాంతిహోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆ తర్వాత స్వామివారికి, అమ్మవార్లకు వేడుకగా కల్యాణోత్సవం జరిగింది. అనంతరం ఆస్థానసేవ నిర్వహించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకట సుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకబృందం పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో దర్శన వేళలు

లాక్‌డౌన్ వేళల నిబంధనలు సడలించిన నేపథ్యంలో నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో దర్శనవేళలను మార్పులు చేశారు. ఈనెల 30వ తేది వరకు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా, మళ్ళీ సాయంత్రం 4.30 నుంచి 6 గంటల దాకా అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ ఇ.ఓ వి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# 'వైఎస్సార్ చేయూత'తో.. మహిళల్లో వెల్లువెత్తిన ఆనందం

- జిల్లాలో లక్షా 36వేల మందికి లబ్ధి
- ఒక్కొక్కరికి 18,750 వంతున నగదు సాయం

జిల్లాలో 45 నుంచి 60 ఏళ్ళ మధ్య వయసున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు చేదోడుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోవిడత 'వైఎస్సార్ చేయూత' పథకం కింద ఈనెల 22న లబ్దిదారుల ఖాతాలో నగదు జమ చేయడంతో మహిళాలోకంలో ఆనందం వెల్లువెత్తింది. జిల్లాలోని ఒక్కొక్క మహిళకు ఈ పథకం ద్వారా 18,750 రూపాయల వంతున మొత్తంగా 256 కోట్లా 56 లక్షల రూపాయల చెక్కులను లబ్దిదారులకు అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ పేద మహిళలకు ఆర్థిక భరోసా కలిగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం అమలుచేస్తున్నారని, ఈ నగదును మహిళలు సద్వినియోగం చేసుకుంటూ వారి కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళలు వ్యాపారాలు చేసుకుంటూ ఆదాయం పెంచుకోవాలనుకుంటే వారికి సాయంగా ప్రభుత్వం మరో 56,250 రూపాయలను బ్యాంకుల ద్వారా




రుణంగా ఇవ్వడం జరుగుతుందని కూడా చెప్పారు. ఈ రెండో విడతలో మరో 3500 మందికి అదనంగా ఈ పథకం వర్తింపజేశామన్నారు. తొలుత వీడియో సమావేశం ద్వారా అందరికీ ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం లబ్దిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ట్రైనీ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జేసీ బాపిరెడ్డి, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, మెప్మా పి.డి రవీంద్ర పాల్గొన్నారు.

### వలంటీర్ పోస్టులకు

## దరఖాస్తులు పంపండి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల కోసం దరఖాస్తులు కోరుతున్నామని, ఈనెల 25వతేది లోగా (జిఎస్ డబ్ల్యుఎస్‌వలంటీర్.ఏపిసిఎఫ్‌ఎస్ఎస్.ఇన్) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి విద్యార్హత కలిగినవారు అర్హులని, ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు.

### బిజెపి ఆధ్వర్యంలో..

## శానిటైజర్లు పంపిణీ

వింజమూరులోని కోవిడ్ కేర్ సెంటర్‌లో ఉన్న బాధితులకు, సిబ్బందికి బిజెపి నాయకుడు పులిచర్ల వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల మాస్కులు, శానిటైజర్లు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. డాక్టర్ హరికృష్ణతో పాటు బిజెపి మండల కార్యదర్శి మూలి బాల కృష్ణారెడ్డి, బిజెపి యువమోర్చా నాయకులు ఎం.కొండారెడ్డి, నాయకులు డేగా మధు, శ్రీరామ్, శ్రీనివాసులు, హరీష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### దొరువులపాళెంలో..

## మాస్కులు పంపిణీ

ముత్తుకూరు మండలంలోని దొరువులపాళెం గ్రామంలో ఈనెల 20న పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ పోతుగుంట మల్లికార్జున ఆధ్వర్యంలో పేదలకు మాస్కులు పంపిణీ చేశారు. ఎంపిటిసి మాజీ సభ్యుడు దారా శ్రీనివాసులు ద్వారా రెండువేల మాస్కులను పేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.విజయమ్మ, మేరీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

### ధరలు లేక...

## దిగాలు పడిన మామిడి రైతులు

**గత ఏడాది కేజీ వంద.. ఇప్పుడు వందకి నాలుగు కేజీలు**



ఈ సీజన్‌లో మామిడి తోటలు బాగా పండినా, ఆశించిన ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. గత ఏడాది కిలో వంద రూపాయలకు పైగానే ధర పలికినా, ఇప్పుడు వందకి నాలుగు కిలోల వంతున కూడా విక్రయిస్తున్నారు. కరోనా లాక్‌డౌన్‌ల నేపథ్యంలో సరైన రవాణా వసతులు, ఎగుమతులు లేక ఎక్కడి పంట అక్కడనే తక్కువ ధరలకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది బంగినపల్లి మామిడిపండ్లు కేజీ 65 రూపాయల పైగానే ఉండగా ఈ ఏడాది 15 రూపాయలే ఉందని, నీలం రకం కాయల ధర గత ఏడాది 40 రూపాయలు ఉండగా ఈ ఏడాది 10 రూపాయలు పలుకుతోందని రైతులు చెప్తున్నారు. అదేవిధంగా తోత్‌పూర్(బెంగళూరు రకం) కాయలు గత ఏడాది కేజీ 25- 35 రూపాయలు మధ్య ఉండగా ఈ ఏడాది ఏడు రూపాయలకు అడుగుతున్నారని, దీంతో పెట్టిన పెట్టుబడులలో సగం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని కనీసం కోత కూలీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ఆత్మకూరు డివిజన్‌లోని ఆత్మకూరు, ఏఎస్ పేట, సంగం మండలాలలో సుమారు 3 వేల ఎకరాలలో మామిడి తోటలు రైతులు సాగు చేస్తున్నారు. బంగినపల్లి, రసాలు, తోతేపూర్(బెంగళూరు), నీలం వంటి రకాలు మామిడి తోటలు ఇక్కడ అధికంగా సాగులో ఉన్నాయి. కనీస గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడంతో మామిడి రైతులు నిరాశలో పడిపోయారు. కోతకు కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు చెట్ల పైనే కాయలు వదిలేస్తున్నారు. ఈ దుస్థితిలో తమను ప్రభుత్వం ఆదుకుని తగు సాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మ ఆలయానికి 50వేల విరాళం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానానికి కావలికి చెందిన భక్తురాలు కొండెపి నాగలక్ష్మి ఇటీవల 50,116 రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ వెంకట శ్రీనివాసులురెడ్డిలు ఆమెను సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నాయుడుపేట పట్టణంలోని వల్లీ దేవసేన సమేత శ్రీ షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల20న ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేడుకగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవం నిర్వహించారు. మూడురోజుల పాటు ఈ వేడుకలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహనకృకష్ణశర్మ, దాతల ఆధ్వర్యంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక ప్రముఖులు చదలవాడ గణేశ్‌శర్మ, రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సి.ఐల పుట్టినరోజున సేవలు



గూడూరు రూరల్ సి.ఐ శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గూడూరు గమల్లపాలెం లోని మై ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెప్మా మరియు మునిసిపాలిటీ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహం లోని నిరాశ్రయులకు ఈ నెల 19న మధ్యాహ్నం భోజనం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వసతి గృహాన్ని మై ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు చాలాచక్కగా నిర్వహిస్తున్నారని, తన పుట్టినరోజును ఇలా జరుపుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సుబ్రహ్మణ్యం, భాస్కర్, శంకర్, మనోజ్, చైతన్య, సంస్థ సభ్యులు కలీమ్, రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అన్నదానం

అలాగే, గూడూరు పట్టణ సిఐ దశరథరామారావు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 20న మైనారిటీ నాయకులు గోల్డ్ సయ్యద్, అన్వర్, ఇబ్రహీం, అలీ, గౌస్‌ల దాతృత్వంతో నిరాశ్రయుల వసతి గృహంలోని అభాగ్యులకు మధ్యాహ్న భోజనం, పండ్లు మరియు



స్వీట్లు అందించారు. సిఐ దశరథ రామారావు మాట్లాడుతూ మై ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఎంతోమంది అభాగ్యులకు ఆసరాగా నిలిచారని కొనియాడారు, తన పుట్టినరోజును ఇలా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ సభ్యులు కలీమ్, రమేష్, సందీప్, దావూద్, ఫహీం, హరి, మహేష్, జావిద్ పాల్గొన్నారు.

## యోగాసనాలతో శారీరక ఆరోగ్యం

**- మాజీ ఎమ్మెల్యే సునీల్**



యోగాసనాలు సాధన చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉండడంతో పాటు శరీరం దృఢంగా ఉంటుందని గూడూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్ చెప్పారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న స్థానిక ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రాంగణంలో నిర్వహిస్తున్న యోగ సాధనలో సునిల్‌కుమార్ పాల్గొని యోగ చేశారు. యోగ దినోత్సవం సందర్భంగా యోగా గురువు కట్టా మురళీకృష్ణను పాశం సునీల్ కుమార్ శాలువా కప్పి సన్మానించారు, అనంతరం యోగాసనాల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. యోగాసనాలు వేయడం వల్ల మానసిక వత్తిడిని తట్టుకోవడంతో పాటు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. చిన్ననాటి నుంచే యోగ సాధన చేయాలని, అప్పుడే విద్యపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ధనంజయరెడ్డి, జాయింట్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# వృద్ధులకు 'ప్రగతి' సాయం




గూడూరులోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ దాశెట్టి శకుంతలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు దాశెట్టి పూర్ణచంద్రరావు సహకారంతో, 30 వేల రూపాయల వ్యయంతో శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు 4 నూతన టాయిలెట్స్ నిర్మించారు. ఈ సందర్భంగా స్థానిక సిద్ధు అలెర్జీ చెస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ హరి ప్రసాద్ దాశెట్టి పూర్ణచందర్రావు సేవలను కొనియాడారు. అలాగే అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ ప్రగతి సేవా సంస్థ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, యమహా సుబ్రమణ్యం, సెక్రెటరీ జి.చంద్రశేఖర్, దాత పూర్ణచంద్రరావు, మంజులమ్మ, బత్తిన సుధాకర్, కృష్ణ (సిల్వర్ ప్యాలెస్) గ్రానైట్ ప్రభాకర్, కోట కృష్ణ, కరిముల్లా, వాచ్‌షాపు రాము, ఐటీ ప్రభాకర్, పురంధర్‌రాజు, కెఆర్ఎం, పిల్లల శీను, తనూజ్ తదితరులు పాల్గొన్నారు

# ఏరియా ఆసుపత్రికి 'లయన్స్' సహకారం

గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో 30 ఆక్సిజన్ సిలిండర్లు రీఫిల్ చేసి అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ యం.రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్ట్ రీజియన్‌ఛైర్మన్ లయన్ యస్.కె.రియాజ్ అహ్మద్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణ, వైద్యశాల ఆర్.యం.ఒ శైలజ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జె.సురేష్‌బాబు, యం.వి.రమణయ్య డాక్టర్ కె.చంద్రహాస్, పి.వి.జగదీష్‌చంద్ర, యస్.కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు

# ఏకాంతంగా.. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

గూడూరులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఈనెల 19 నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆలయంలో ఏకాంతంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 29వ తేది వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని ఆలయ ఇఓ తాతా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



# భక్తుల పాలిటి పెన్నిధి.. నెల్లూరు శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధి

**నెల్లూరుజిల్లాలోని ప్రాచీనమైన దేవాలయాల్లో నెల్లూరు నగరంలోని మూలాపేటలో వెలసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఒకటి. సర్వాంగ సుందరంగా, నిర్మితమై ఉన్న ఈ కోవెలలో కొలువై ఉన్న వేణుగోపాలస్వామి ఎందరో భక్తులకు ఇలవేల్పు. అటు జీవులను, ఇటు గోవులను రక్షిస్తూ భగవంతుడైన ఆ శ్రీకృష్ణ పరమాత్మ ప్రతిరూపమైన శ్రీ వేణుగోపాలుని దర్శనం..సకల శుభప్రదం. కోరిన వరాలను ప్రసాదించే వేలుపుగా, సంతానం లేక పరితపించేవారికి సంతానాన్ని అనుగ్రహించే దైవంగా ఎంతోకాలంగా శ్రీ వేణుగోపాలస్వామి ప్రసిద్ధి. ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది.**

నెల్లూరు నగరంలోని ప్రధానమైన దేవాలయాల్లో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం ఎంతో ప్రఖ్యాతి చెందింది. అనాదిగా నెల్లూరుజిల్లా ప్రజల, భక్తుల పూజలందుకుంటూ ఎంతోమంది భక్తులకు ఇలవేల్పుగా ఉన్నాడు శ్రీ వేణుగోపాలుడు. ఈ ఆలయం ప్రాంగణం చెంతనే ఉన్న సత్రాల్లో వివాహాలు చేసుకుంటే ఎంతో మంచిదని, వారి వైవాహిక జీవితం శుభప్రదంగా సాగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే ఇక్కడ పెళ్ళిళ్లు విశేషంగా జరుగు తుంటాయి.





## మన దేవాలయాలు 53

## ఆలయ చరిత్ర


సుమారు 150 ఏళ్ళ క్రితం నెల్లూరులోని కంఠాబత్తిన పాపిరెడ్డి అనే భక్తుడు, మహాదాత అప్పట్లో ఇక్కడున్న శివాలయానికి ధర్మకర్తగా ఉండేవారని, శివాలయం కోసం కోనేరు నిర్మాణం చేస్తుండగా అక్కడ శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహం లభించగా ఆ విగ్రహమూర్తిని కూడా అప్పట్లో శివాలయంలోనే ప్రతిష్టించారని అంటారు. సాక్షాత్తూ ఆ వేణుగోపాలస్వామి ప్రేరణతోనే దాతలు, భక్తులైన కంఠాబత్తిన దంపతులు 1873వ సంవత్సరంలో ఇక్కడ రుక్మిణి-సత్యభామా దేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానాన్ని నిర్మించారని, వారు తమ యావదాస్తిని శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధి సేవకే అర్పించారని చెప్తుంటారు.

## శిల్పకళా శోభితం.. సర్వాంగ సుందరం :

శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఎంతో అద్వితీయంగా, శిల్పకళా శోభితంగా.. సర్వాంగ సుందరంగా ఉండి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అత్యద్భుతమైనరీతిలో ఉన్న అయిదంతస్తుల రాజగోపురం ఆధ్యాత్మికతకే కట్టిన గోపురంగా భాసిస్తూ ఉంటుంది. ఆలయం గోడలపై రాతితో చెక్కిన దశావతార శిల్పాలు కనువిందుగా దర్శనమిస్తుంటాయి. మండపాలన్నీ రాతిస్తంభాలతో రమణీయంగా ఉంటాయి. ఆలయం ముంగిట మనోహరమైన రీతిలో చెక్కబడిన గరుడాళ్వార్ మండపం, ఆలయ మండపం పైకప్పుపై 'వటపత్రశాయి' రూపం ఎంతో కనువిందు చేస్తుంటాయి. ఆలయ ధ్వజస్తంభం ఇక్కడ ఆలయం ప్రాంగణంలో కాక, ఆలయం ముఖమండపం మధ్యలో ఉండడం ఒక విశేషం. గర్భాలయంలో ముగ్ధమనోహర రూపుడైన మురళీకృష్ణుడు చతుర్భుజునిగా వెలసి, ఇరు దేవేరులతో కలసి భక్తాదులందరినీ అనుగ్రహిస్తుంటాడు. ఇంకా ఈ ఆలయంలో కొలువై ఉన్న శ్రీ ఆదిలక్ష్మీదేవి అమ్మవారు, ఆండాళ్ అమ్మవార్ల మందిరాలతో పాటు క్షేత్రపాలకుడైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి మందిరం, శ్రీ ఆంజనేయస్వామి సన్నిధి, ఆళ్వార్ల మందిరాలకు విశేషపూజలు జరుగుతుంటాయి.

## చైత్రమాసంలో.. బ్రహ్మోత్సవాలు :

రుక్మిణీ సత్యభామా సమేతుడైన శ్రీ వేణుగోపాలస్వామివారికి ప్రతిఏడాది చైత్రమాసంలో ఏకాదశ ప్రారంభరోజుల్లో పెద్దఎత్తున బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. శ్రావణమాసంలో శ్రీకృష్ణ ఉత్సవాలు, ఆశ్వీయుజ మాసంలో నవరాత్రి మహోత్సవాలు, కార్తీకమాసంలో దీపావళి వేడుకలతో పాటు అనేక పర్వదినాల్లో విశేషమైన ఉత్సవాలు జరుగుతుంటాయి. పుష్య మాసంలో ధనుర్మాసపూజలు, ముక్కోటి వైకుంఠ ద్వారదర్శనం, పాల్గుణ మాసంలో తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల పర్యవేక్షణలో, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాలస్వామికి నిత్యపూజలతో పాటు విశేషపూజలు, సేవలు, ఏటా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. ఏదేమైనా లోకరక్షణ కోసం అవతరించిన అవతారమూర్తి శ్రీకృష్ణభగవానుడు. ధర్మపరిరక్షణార్ధం 'సంభవామి యుగే యుగే' అన్నట్లుగా ఆ పరమాత్మ ఈ కలియుగంలో ధర్మాన్ని పరిరక్షించేందుకు లీలామానుష వేషధారిగా అవతరించాడు. భక్తవరదుడైన ఆ శ్రీకృష్ణభగవానుని మనసారా భక్తితో స్మరించుకుంటూ ఆయన అవతారరూపమైన శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకుంటే అన్ని కష్టాలు తీరిపోయి, సకల శుభాలు కలుగుతాయని వేరే చెప్పనక్కర లేదు.

# జిల్లాకు జాతీయ అవార్డును తెచ్చిన ఘనత.. భాస్కర్‌భూషణ్‌దే

*జిల్లాలో ఉన్నది కొద్దికాలమే అయినా.. ఎలాంటి హంగూ అర్భాటం లేకుండా ఎంతో ఉత్తమమైన రీతిలో వ్యవహరిస్తూ జిల్లాపోలీసు శాఖకు రాష్ట్రవ్యాప్త ఖ్యాతినే కాక, జాతీయస్థాయి అవార్డులను తెచ్చిపెట్టిన జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. పదోన్నతిపై ఆయన కేంద్రానికి వెళ్తున్నారు. ఈ కరోనా కష్టకాలంలో అటు ప్రజలకు, ఇటు జిల్లా పోలీసులకు అండగా నిలిచిన ఎస్పీ.. మంచి పనితీరుతో జిల్లా ప్రజలను ఆకట్టుకున్నారు.*

## ఉత్తమ సేవలందించిన ఎస్పీ.. కేంద్ర సర్వీసులకు బదిలీ



ఎస్పీ అంటేనే.. అందరూ వణికిపోయేలా ఉండాలనే తత్వంతో ఉండేవారు ఎంతోమంది. కానీ, భాస్కర్‌భూషణ్ అలా కాదు. నిగర్వి.. నిరాడంబరుడు. అత్యంత క్రమశిక్షణతో తాను విధులు నిర్వహించడమే కాక పోలీసులు కూడా నిబద్ధతతో పనిచేసేలా పురమాయించేవారు. నేరాలను ఘోరాలను కట్టడిచేస్తూ గట్టి చర్యలెన్నో తీసుకున్నారు. ప్రజలు ముఖ్యంగా మహిళల భద్రతకు ఆయనెంతో ప్రాధాన్యతనిచ్చారు. అబందరగా ఉన్న నగర ట్రాఫిక్ పరిస్థితిని ఒక కొలిక్కి తెచ్చారు. జిల్లాలో పోలీసువ్యవస్థకు సాంకేతిక పాఠాలు చెప్పారు. సాంకేతిక నైపుణ్యంతో నేరాలను అదుపుచేసే అధునాతన పరిజ్ఞానాన్ని అందించారు. అందుకు జాతీయస్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన 'ఐఎస్ఓ 9001 సర్టిఫికెట్‌ను కూడా సాధించి జిల్లాకు అరుదైన గౌరవాన్ని తీసుకురావడమే కాక, మొత్తంగా పోలీసుశాఖకే ఆయన గర్వ కారణంగా నిలిచారు.

### కరోనాలోనూ విశేష సేవలు :

కరోనా విజృంభిస్తున్నా లెక్కచేయకుండా మాస్కులు ధరించని వారికి స్వయంగా తన చేతులతోనే మాస్కులు తొడిగి 'ఈ కరోనాలో జాగ్రత్తగా ఉండాలి బాబూ'..అంటూ ఒక మంచి మిత్రునిలా ప్రజలకు హితవు చెప్పిన ఎస్పీ ఆయన. కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ సమయాల్లో జిల్లా పోలీసువ్యవస్థను స్వచ్ఛంధసంస్థల కంటే మరీ ఎక్కువ సేవాభావంతో పని చేసేలా చేసిన ఘనత ఆయనది. దాంతో జిల్లా పోలీసుల పట్ల ప్రజలకు గతంలో కంటే ఎంతో అభిమానం పెరిగింది. కరోనా విజృంభిస్తున్నా లెక్కచేయకుండా ఎంతోమంది పోలీసులు ప్రాణాలకు సైతం తెగించి విధులు నిర్వహించారు. ఎంతో మంది పోలీసులు ఆ మాయదారి వ్యాధిన పడి బాధలుపడ్డారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు కూడా. అంతటి విషాద పరిస్థితుల్లోనూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా పోలీసు వ్యవస్థను ఉత్తేజపరుస్తూ ఎంతో మంది పోలీసులు కరోనాను జయించి తిరిగి వెంటనే విధుల్లో చేరే ఉత్సాహాన్ని వారిలో కల్పించారు. అంతేకాదు, కరోనాతో మృత్యువాత పడిన కుటుంబాలకు అన్నివిధాలా అండదండలందించారు. పోలీసు వ్యవస్థ ప్రజలతో మంచి స్నేహితునిలా ఉండాలని, స్టేషన్లకు అర్జీలు తెచ్చేవారిని కుటుంబసభ్యుల్లా పలకరించి వారి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ భాస్కర్‌భూషణ్ పదేపదే పోలీసు సిబ్బందిని హెచ్చరించేవారు. అట్లని కరుగ్గా ఉండకపోతే నేరస్తులు మాట వినరు కదా!.. రౌడీలు, అసాంఘికశక్తుల ఆట కట్టిస్తూ అన్నివిధాలా చర్యలు తీసుకున్నారు. ఎక్కడ కఠినంగా ఉండాలో.. ఎక్కడ సౌమ్యంగా ఉండాలో తెలిసిన విజ్ఞులాయన. పెద్దపెద్ద నేరాలను కూడా తనకున్న అపారమైన సాంకేతిక విజ్ఞానంతో ఎన్నో కేసులను చేధించారు. అందుకే అటు పోలీసువర్గాల్లోనూ, ఇటు ప్రజల్లోనూ కొద్దికాలంలోనే ఎంతో మంచిపేరు వచ్చిందాయనకి.



ఈ నెల 23వ తేదీ బుధవారం జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి దేవాలయాన్ని దర్శించుకున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్ కుటుంబసభ్యులు, పక్కన ఆలయ ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి తదితరులు

### కేంద్రంలో ఉన్నతస్థాయి సేవలకు :

నెల్లూరుజిల్లా ఎస్పీగా 2019 డిసెంబరు 8వ తేదిన బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌భూషణ్ కేంద్రంలో ఉన్నతస్థాయి సేవలకు ఎంపిక కావడం ఎంతో విశేషం. ఢిల్లీలో కేంద్ర హోంశాఖలోని 'రీసెర్చ్ అనాలిసిస్ వింగ్'లో డెప్యూటి సెక్రటరీగా డెప్యుటేషన్‌పై ఆయన కనీసం నాలుగేళ్ళ పాటు విధులు నిర్వహించనున్నారని సమాచారం. ఇలాంటి వారు కేంద్రంలో ఉంటే దేశస్థాయిలో మరెంతో విశిష్టమైన సేవలందించవచ్చు. అందుకే ఎస్పీ భాస్కర్ భూషణ్ కేంద్రసర్వీసులకు వెళ్లేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ నెల 22వ తేదీన ఆయన నెల్లూరు నుంచి రిలీవ్ అయ్యారు.

ఏదేమైనా నేటి ఆధునిక కాలంలో పెరిగిపోతున్న అనేకరకాల నేరాలను అత్యద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో పసిగట్టి వాటిని అదుపుచేసే విశేషపరిజ్ఞానం కలిగిన ఎస్పీ భాస్కర్‌భూషణ్ వంటి వారు ఎంతైనా అరుదే. ఆయన స్థానంలో కొత్త ఎస్పీ వచ్చేదాకా గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ జిల్లాను పర్యవేక్షించే బాధ్యత చేపట్టారు.

దేశవ్యాప్త సేవలందించేందుకు పదోన్నతిపై కేంద్ర సర్వీసులకు మన జిల్లా నుంచి వెళ్తున్న ఎస్పీ భాస్కర్‌భూషణ్‌కు శుభాకాంక్షలు చెప్తూ.. ఆయన భవిష్యత్తులో మరెన్నో ఉన్నతశిఖరాలను అందుకోవాలని ఆకాంక్షిస్తోంది.. 'లాయర్'!...





కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక


నెల్లూరు కబుర్లతో, విశేష వార్తలతో
వారం వారం పలకరించే అక్షర నిధి
ప్రపంచం నలుచెరగులా ఉన్న నెల్లూరీయుల పెన్నిధి

లాయర్
వారపత్రికకు

**40వ వార్షికోత్సవ శుభాభినందనలు.**

**బొమ్మిరెడ్డి సురేష్‌రెడ్డి**
**బొమ్మిరెడ్డి సునీల్‌రెడ్డి**





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com